ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 22 నవంబరు 2024

మదనపల్లెను జిల్లా చేయండి



● అసెంబ్లీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెను జిల్లా చేయాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అసెంబ్లీలో కోరారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని, ఆ మాటకు కట్టుబడి మదనపల్లెను జిల్లా చేయాలని అభ్యర్థించారు. ఎంతో ఘనచరిత్ర ఉన్న మదనపల్లెలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించి దేశానికి అందించారని ఈ సందర్భంగా షాజహాన్‌బాషా గుర్తు చేశారు. మద్రాస్ రాష్ట్రంలో 1860లోనే మదనపల్లె రెండో జిల్లా కేంద్రంగా ఉండేదని, ఇంతటి ప్రాముఖ్యమున్న మదనపల్లెను ప్రజల అభీష్టం మేరకు జిల్లా కేంద్రంగా చేయాలని కోరారు. మదనపల్లెలో రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పడమటి ప్రాంతాల్లో విస్తారంగా పండించే టమోటా రైతును అన్ని విధాలా ఆదుకోవడంలో భాగంగా టమోటా ఆధారిత పరిశ్రమ, పల్ప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

● డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య



ముఖాముఖి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య తెలిపారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేయించుకుని సంబంధిత డాక్టర్లను సంప్రదించాల న్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు న్యుమోనియా వచ్చే అవకాశం ఉంటుందని, దీనిని ప్రాథమిక దశలోనే గుర్తించి డాక్టర్లను సంప్రదించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో పలు విషయాలు చెప్పారు.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?
జవాబు: ప్రస్తుతం సీజన్‌ను బట్టి మలేరియా, డెంగ్యూ, డయేరియా సాధారణంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో సిబ్బంది ద్వారా సర్వే చేయిస్తున్నాము. అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ క్లీనిక్‌లలో వీటి కోసం ప్రత్యేకంగా రక్తపరీక్షలు చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో న్యుమోనియాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం వల్ల ఈ జబ్బు వస్తుంది. దీనిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది. గ్రామాల్లోనూ, పట్టణాల్లో ఏఎన్‌ఎం, సీహెచ్‌వో, ఆశాలు సర్వే చేస్తున్నారు. అనుమానిత కేసులను మెడికల్ ఆఫీసర్‌కు రెఫర్ చేస్తున్నారు.

ప్రశ్న: ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్ల పరిస్థితి ఏంటి..?
జవాబు: ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని సౌకర్యాలు కల్పించాము. ఒక డాక్టర్ ఒక లేబర్ అసిస్టెంట్, ఒక ఫార్మసిస్టు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు ఉంటారు. ఇక్కడ అన్ని రకాల రక్తపరీక్షలు చేయించేందుకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: విలేజ్ క్లీనిక్‌లలో పరిస్థితి ఏంటి?
జవాబు: సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉంటారు. డెంగ్యూ మలేరియా, గర్భనిర్ధారణ పరీక్షలు చేసేందుకు అన్ని రకాల సదుపాయాలు గ్రామాల్లో అందుబాటులోకి వచ్చాయి. షుగర్, బీపీ పరీక్షలు చేసేందుకు విలేజ్ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

ప్రశ్న: క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం ఎలా...?
జవాబు: క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ ప్రధానంగా ఉన్నాయి. వీటిని సర్వే చేసి గుర్తించి జీజీహెచ్‌కు రెఫర్ చేయాలని సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలకు ట్రైనింగ్ ఇచ్చాము.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అభినందనీయం : తులసిరెడ్డి



వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. 1937 నుంచి శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని గాని, హైకోర్టు గాని ఏదొకటి రాయలసీమలో ఏర్పాటుచేయాలని ఉంది. కానీ దురదృష్ట వశాత్తు అమరావతిలోనే రెండు ఏర్పాటయ్యాయన్నారు. ఇందుకు ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్ జగనే కారణమన్నారు. ఇప్పటికైనా కర్నూలులో ఏర్పాటుచేయాలని నిర్ణయించడం శుభ పరిణామమన్నారు. ఎన్నో రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడ నుంచి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని, కర్నూలు నుంచి జాతీయ మానవహక్కుల కమీషన్, సీబీఐ కోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ తదితర కార్యాలయాలను అమరావతికి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

అసెంబ్లీ సాక్షిగా.. కర్నూలుకు హైకోర్టు బెంచ్



● తీర్మానం ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
● ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ
● రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం
● ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం లేఖ
● ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ
● ఐదు నెలల్లోనే అమలుకు శ్రీకారం
● ఐదేళ్ల పాటు నాన్చిన జగన్ ప్రభుత్వం



కర్నూలు/కడప, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఇప్పటికే హైకోర్టు అభిప్రాయం కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ రాశారు. బుధవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తీర్మానం ప్రవేశ పెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వం కర్నూలు న్యాయ రాజధాని అని అక్కడ హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టింది. ఎన్నికల ముందు ప్రజాగళం సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ఐదు నెలలకే అమలు దిశగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ తీర్మానంపై రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ

కర్నూలులో హైకోర్టు అంటూ వైసీపీ రాజకీయ స్వలాభం కోసం ఐదేళ్లు మభ్యపెట్టారు. మరోవైపు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి మంగళగిరిలో ఏర్పాటుకు సంబంధించి జీవో ఇచ్చారు. 2022 డిసెంబరు 5న కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైసీపీ నిర్వహించిన సీమ గర్జన సభలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నూలును న్యాయరాజధానిగా మారుస్తాం.. హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారు. బుగ్గన ఓ అడుగు ముందుకేసి కర్నూలు నగరానికి నాలుగు వైపులా 25 కిలోమీటర్ల దూరంలో కనిపించేలా జగన్నాథగట్టుపై అందమైన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. మాయ చేశారే తప్పా అమలుకు చర్యలు చేపట్టలేదు.

ఐదు నెలల్లోనే..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. వైసీపీ అధికారం చేపట్టింది. అయినా చంద్రబాబు మాట మార్చలేదు. అదే హామీకి కట్టుబడి నిలబడ్డారు. గత ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, సీఎం జగన్ కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తే.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 'హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడుతాం..' అంటూ ప్రజాగళం సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేసింది. హైకోర్టు అభిప్రాయం కోరుతూ గత నెల 28న లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ నంబరు.2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ వెంటనే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం, గురువారం శాసనసభ, మండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ చర్యలో పాల్గొన్న రాయలసీమ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం వ్యక్తం చేశారు.

సాకారం దిశగా 87 ఏళ్ల స్వప్నం

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 87 ఏళ్ల స్వప్నం. బెంచ్ రూపంలో సాకారం కాబోతోందని రాయలసీమ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహంలో శ్రీబాగ్ భవనంలో జరిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రతినిధుల సమావేశంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందమే 'శ్రీబాగ్ ఒడంబడిక'. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుతో కర్నూలు కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసినా నాలుగేళ్ల ముచ్చటగానే ముగిసింది. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయింది. అయితే.. సీమ ప్రజల మదిలో శ్రీబాగ్ ఒడంబడిక అంశాలు చెదిరిపోలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.



ఇది చారిత్రాత్మక నిర్ణయం..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానం ప్రవేశ పెట్టడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం చారిత్రాత్మకం. రాయలసీమ ప్రాంతాన్ని వివిధ రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు సీమ బిడ్డగా సీఎం చంద్రబాబు కృషి అభినందనీయం. శాశ్వత బెంచ్ ఏర్పాటుతో సీమ ప్రజలకు న్యాయ సేవలు కర్నూలులోనే అందుబాటులోకి వస్తాయి.

- ఎన్ఎండీ ఫరూక్, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, నంద్యాల

ఏడాదిలో ప్రక్రియ పూర్తి చేయాలి..

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తే ఆ రోజు స్పష్టంగా చెప్పాం.. పరిపాలన సౌలభ్యం కోసం రాజధానిలోనే ఉండాలని. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయ శాఖ మంత్రి మంత్రి ఫరూక్ నాయకత్వంలో బెంచ్ ఏర్పాటు కాబోతుండడం ఆనందంగా ఉంది. ఏడాదిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరుతున్నాను.

- నారా లోకేశ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి

వైసీపీ మాట తప్పింది.. మడమ తిప్పింది..

వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని పాలాభిషేకాలు చేయించుకున్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్నారు. మాట తప్పి మడమ తిప్పి రాయలసీమ ద్రోహిగా జగన్ నిలిచారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.


- ఆర్.సవిత, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి

సీమ ప్రజలకు ఎంతో ఉపయోగం..

హైకోర్టులో రాయలసీమ జిల్లాలకు చెందిన కేసులే 50 శాతానికిపైగా ఉన్నాయి. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేస్తే ఎనిమిది జిల్లాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం బెంచ్ ఏర్పాటుపై సభలో ఏకగ్రీవ తీర్మానం చేయడం.. ఆ తీర్మానంలో నేను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని సీఎం చంద్రబాబు చాటిచెప్పారు.

- పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే, కడప జిల్లా

ఝురికోనకు రూ.4 కోట్లివ్వండి



● అసెంబ్లీలో పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి వినతి

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని మూడు మండలాలకు తాగునీరు అందజేస్తున్న ఝురికోన ప్రాజెక్టు నిర్వహణాలోపం కారణంగా సమర్థవంతంగా పనిచేయడం లేదని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గురువారం అసెంబ్లీలో స్వల్ప వ్యవధి ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012లో రూ.100 కోట్ల వ్యయంతో ఝురికోన ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. నియోజకవర్గంలోని మూడు (కలికిరి, కలకడ, కేవీపల్లె) మండలాల్లోని 650 కుగ్రామాలకు నిరంతరాయంగా తాగునీరు అందజేయాలన్న లక్ష్యంతో దీని నిర్మాణం జరిగిందని చెప్పారు. దాదాపు 1.42 లక్షల జనాభా దాహార్తిని తీరుస్తున్న ఝురికోన ప్రాజెక్టు గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిందని, కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు జరగడం లేదని, పైపులైన్ల లీకేజీలను అరికట్టలేకపోయారని, నీటిని నిల్వ చేసే ట్యాంకులను గాలికొదిలేశారని విమర్శించారు. దీంతో అనుకున్న స్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. ఇప్పటికే పీలేరు నియోజకవర్గం మొత్తం మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, రాబోయే వేసవిలో కనీసం ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలన్నా ఝురికోన ప్రాజెక్టు ఒక్కటే గత్యంతరమని, తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కేవల రూ.4 కోట్లు మంజూరు చేస్తే మొత్తం సరఫరా వ్యవస్థను పునరుద్ధరించవచ్చన్నారు. సంబంధిత శాఖకు చెందిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్ | 6
● 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారం స్వాధీనం

నాటుసారా నిర్మూలనకు సహకరించాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు



నక్కలదిన్నెతాండాలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డీసీ జయరాజు

మదనపల్లె టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. గురువారం స్థానిక నక్కలదిన్నెతాండాలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ నాటుసారా లేని గ్రామాలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, నాటుసారా తాగితే అనారోగ్యం పాలవుతారని, ఆయుష్షు తగ్గి కుటుంబానికి ద్రోహం చేసిన వాళ్లవుతారన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై ఇప్పుడు నాన్ బెయిలబుల్ కేసులు నమోదవుతాయని, ఎనిమిదేళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. మూడుసార్లు పట్టుబడిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని, బైండోవర్ కేసులు ఉల్లంఘిస్తే రూ.లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎరిషావలి, డీటీ అస్లాంబాషా, ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో నిర్లక్ష్యం వద్దు

కర్ణాటక నుంచి వచ్చే అనుమానిత వాహనాల తనిఖీలో నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని ఎక్సైజ్ శాఖ డీసీ జయరాజు తెలిపారు. కర్ణాటక సరిహద్దులోని చీకిలబైలు చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఆయన అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం పుంగనూరు రోడ్డులోని ఏపీఎస్‌బీసీఎల్ డిపోను తనిఖీ చేశారు. స్టాక్ ఎంత ఉంది, దుకాణాలకు ఎంత మేరకు సరఫరా చేస్తున్నారు తదితర విషయాలను డిపో మేనేజర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు.

కార్గో ద్వారా ఆర్టీసీకి రూ.1.20 కోట్ల ఆదాయం



పీలేరులోని కార్గో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారి జనార్ధన్

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్గో సేవల ద్వారా అన్నమయ్య, కడప జిల్లాల్లో నెలకు రూ.1.20 కోట్ల ఆదాయం వస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ అసిస్టెంట్ కమర్షియల్ ఆఫీసర్, కార్గో అధికారి జనార్ధన్ తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండులోని కార్గో కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కార్గో ఆదాయ లక్ష్యం నెలకు రూ.58.05 లక్షలు కాగా ప్రస్తుతం రూ.45 లక్షలు వస్తోందని, కడప జిల్లా లక్ష్యం రూ.1.53 కోట్లు కాగా ప్రస్తుతం రూ.75 లక్షలు వస్తోందని తెలిపారు. కడప, ప్రొద్దుటూరు, మదనపల్లె ఆర్టీసీ డిపోల్లోని కార్గో కేంద్రాలు ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉన్నాయన్నారు. మిగిలిన కేంద్రాల్లోనూ ఆదాయం పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న కార్గో కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు ఏజెంట్లను నియమించుకుని కమీషన్ ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పీలేరు కేంద్రం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో పీలేరు సీఐ సుబ్బమ్మ, ఏజెంటు తిరుమలయ్య, సహాయకులు రోషన్, తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులే..!

● 40 ఏళ్లుగా జెడ్‌హెచ్‌డీసీ భూముల పట్టాల కోసం నిరీక్షణ
● ఏక్‌సాల్ పర్మిషన్లతో ప్రభుత్వ లబ్ధికి దూరం
● సంబేపల్లె తప్ప అన్ని మండలాల్లో పట్టాల పంపిణీ
● కూటమి ప్రభుత్వంపైనే దళిత రైతుల ఆశలు



సంబేపల్లె మండలంలోని జెడ్‌హెచ్‌డీసీ భూమి

సంబేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జెడ్‌హెచ్‌డీసీ భూముల కోసం 5, 10, 15 ఏళ్లు కాదు ఏకంగా 40 సంవత్సరాలుగా దళిత రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం సర్వే నెంబరు-430లో 110 ఎకరాలు, మోటకట్లలో గ్రామం సర్వే నెంబరు-831లో 159 ఎకరాలు జెడ్‌హెచ్‌డీసీ కింద ఉంది. ఈ భూముల్లో పంటలు పండించేది రైతులు దానిపై పెత్తనం మాత్రం జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులది. ఈ భూములకు సంబంధించిన ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 154 మంది దళిత రైతులు పట్టాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. 1985 నుంచి ప్రతియేటా ఏడాదికి రూ.75 రుసుం చెల్లించి రైతులు ఏక్‌సాల్ పర్మిషన్‌తో పొలాలు సాగు చేసుకుంటున్నారు. వారు సాగు చేసిన పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు కానీ, రాయితీలు కానీ రైతులకు రావడం లేదు. రైతులకు పట్టాలు లేవు, పాస్‌బుక్కులు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి వారు ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారు. నష్టం వచ్చినా కష్టం వచ్చినా ఫలితం మాత్రం రైతులకు దక్కడం లేదు. ఏళ్ల తరబడి దళిత రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

2015 నుంచి ప్రతిపాదనలు

జెడ్‌హెచ్‌టీసీ భూములకు సంబంధించి పట్టాల కోసం జల్లా శివవెంకటస్వామి ఫిర్యాదు మేరకు 2015లో చీఫ్ సెక్రటరీ అప్పటి జిల్లా కలెక్టర్‌కు పట్టాలు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. అయితే పట్టాలు మాత్రం అప్పట్లో ఇవ్వలేదు. 2017లో అప్పటి కడప ఉమ్మడి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ ఉమ్మడి కడప జిల్లాలోని సంబేపల్లె, పెండ్లిమర్రి, వల్లూరు, ఖాజీపేట, కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పుల్లంపేట, నందలూరు, అట్లూరు, గోపవరం, పోరుమామిళ్ల, మైదుకూరు మండలాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములు ఉన్నాయని, 1538 మంది రైతులకు సంబంధించి 2906.74 ఎకరాలకు పట్టాల కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపారు. అయితే ఎందుకనో తెలియదు కానీ జిల్లాలో సంబేపల్లె తప్ప మిగిలిన అన్ని మండలాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి దళిత రైతులకు పట్టాలు అందజేశారు. ఇప్పటికీ సంబేపల్లెకు చెందిన రైతులు మాత్రం పట్టాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా దళిత రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు.

కాలువకు జెడ్‌హెచ్‌డీసీ భూములు

సంబేపల్లె మండలానికి సంబంధించిన జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో 2017లో మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ సబ్‌కెనాల్ కాలువలకు ఈ భూములు పోయాయి. భూములు కోల్పోయిన రైతులకు రూ.54,58,104 మంజూరైనట్లు అప్పటి జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఉత్తర్వులు పంపారు. కానీ అప్పట్లో భూములు కోల్పోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదని బాధిత రైతులు తెలిపారు.



2017లో జీఎన్ఎస్ఎస్ కాలువ భూములకు సంబంధించి పరిహారం ఉత్తర్వులు

యువత 'ఉన్నతి'కి శిక్షణ

● ఉపాధి కూలీల కుటుంబాలకు ప్రోత్సాహం ● శిక్షణ కాలంలో ఆర్థిక ప్రయోజనం

కడప (ఎన్జీఆర్‌సర్కిల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చి వివిధ రకాల జీవనోపాధుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యం వచ్చేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే వారి పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలోని యువతకు శిక్షణ ఇస్తున్నారు. అర్హులైన కుటుంబంలో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారిని గుర్తించి వారి ఆసక్తి మేరకు పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందులలో న్యాక్ సెంటరు, కడపలో టీటీడీసీ, రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పులివెందులలో సర్వేయరు, సోలార్ పీవీ మ్యాడ్యెవ్ల్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఏసీ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఇక్కడి శిక్షణ కేంద్రం డెకాన్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా కడపలోని టీటీడీసీలో ఉన్న స్కిల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ స్టోరు మేనేజరు అండ్ రిటైల్ సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. రాజంపేటలోని గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలపరిమితి 90 నుంచి 120 రోజులు ఉంటుంది. శిక్షణా కాలంలో రోజు కూలీ రూ.300 చొప్పున 90 రోజులకు శిక్షణ కాలానికి సుమారు రూ.27 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. కోర్సుకు అవసరమైన మెటీరియల్‌తో పాటు స్త్రీ, పురుషలకు యూనిఫాం ఉచితంగా హాస్టలు వసతి కూడా కల్పిస్తున్నారు. హైస్పీడ్ ఇంటర్‌నెట్ ల్యాబ్ కూడా అందుబాటులో ఉంటుంది. శిక్షణ అనంతరం ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ప్రైవేటురంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.


శిక్షణ పొందుతున్న యువత

ఎంపిక ఇలా..

ఉపాధి పథకంలో వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్న వారి వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిని డీఆర్‌డీఏ, సీడప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేసి వంద రోజులు పని చేసిన వారి అభిప్రాయాలను సేకరిస్తారు. ఇందులో వారి కుటుంబంలో ఎవరైనా చదువుకున్న యువత ఉంటే వారి ఆసక్తిని బట్టి స్వయం ఉపాధి కల్పనకు శిక్షణ ఇస్తారు. జిల్లాలో ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 18,962 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గుర్తించారు. వీరి కుటుంబాల్లో 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపనున్నారు. ఈ మేరకు ఇప్పటికే తొలివిడత శిక్షణ ప్రారంభమైంది.

ఉన్నతికి ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వారికి మరింత మెరుగైన జీవనోపాధుల కోసం వారి కుటుంబంలో చదువుకున్న పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పుడిప్పుడే ఈ కార్యక్రమం ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. డ్వామా పీడీతో మాట్లాడి మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ

సేల్స్ రంగంలో ఉద్యోగం కావాలి



మాది నిరుపేద కుటుంబం. కూలీ వల్లనే జీవనం. ఉపాధి హామీ పథకం ద్వారా మా తల్లిదండ్రులు పనులకెళ్లేవారు. నేను బీకాం వరకు చదివాను. ప్రభుత్వ ఉద్యోగం వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఉపాధి హామీ కూలీల పిల్లలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారని తెలిసింది. ప్రస్తుతం టీటీడీసీలో శిక్షణ పొందుతున్నాను. సేల్స్ రంగంలో ఉద్యోగం చేయాలన్నది నా కోరిక.

- కె.సుకన్య, గంగనపల్లె, కాశినాయన మండలం

రిటైల్ రంగంలో శిక్షణ తీసుకుంటున్నా



మా తల్లిదండ్రులతో పాటు నేను కూడా ఉపాధి హామీ పనికి వెళ్లేవాడిని. ఇంటర్ వరకు చదువుకున్నాను. వందరోజుల పనిదినాలు పూర్తి కావడంతో ఉన్నతి ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని జాబ్ కో-ఆర్డినేటరు నరసింహులు ద్వారా తెలుసుకుని టీటీడీసీలో శిక్షణ తీసుకుంటున్నా. దూర ప్రాంతంలో అయినా సరే రిటైల్ రంగంలో ఉపాధి దొరికితే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను.

- వై.రామసుబ్బయ్య, ఎత్తిరాజులపల్లె, బద్వేలు మండలం

దిష్టి తగలకుండా...

● పొలంలో హీరోయిన్ల చిత్రాలు

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరదిష్టికి నల్లరాయి అయినా పగులుతుందనేది పెద్దల నానుడి. దిష్టి పోవడానికి పురాతన కాలం నుంచి పలు రకాల బొమ్మలు పొలాల్లో పెడుతుంటారు. చిన్న పాపలకు బుగ్గలపై నల్ల చుక్క, ఇంటికి దిష్టి తగలకుండా దిష్టిబొమ్మలు కట్టడం, పొలాల్లో కుండకు తెల్లని చుక్కలు పెట్టి ఉంచడం, మనిషి ఆకారంలో బొమ్మలు ఉంచడం పాత పద్ధతులు. అయితే నేటి యువత వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి వినూత్నమైన వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇందులో భాగంగా పంటలకు దిష్టి తగలకుండా ఇతరుల చూపు పంట పొలాలపై నేరుగా పడకుండా పొలాలలో అందమైన హీరోయిన్ల చిత్రాలు పెట్టి నరదిష్టి తగలకుండా చూస్తున్నారు.

మండలంలోని నారేవారిపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప తాను సాగు చేసిన టమోటా, బంతిపూల తోటలో అందమైన హీరోయిన్ల బొమ్మలు పెట్టాడు. దీంతో ఈ దారిలో వెళుతున్న వారి దృష్టి పంటపై కాకుండా హీరోయిన్ల చిత్రాలపై పడుతుందని దీంతో పంటకు దిష్టి తగలకుండా ఉంటుందని ఆ రైతు చెబుతున్నాడు. ఏదేమైనా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవడానికి రైతులు విభిన్న ప్రయోగాలు చేస్తున్నారు.

చూపరుల దృష్టి పంటపై పడకుండా..



నాకు రోడ్డు పక్కనే రెండు ఎకరాల పొలం ఉంది. ఇందులో ఎకరం టమోటా, ఇంకో ఎకరంలో బంతి పూలు తోట సాగు చేశాను. పూల తోట, టమోటా తోటలు పంట బాగా పండాయి. రోడ్డు పక్కన వెళ్లే వారు పంటను చూసి బాగా పండిందని చూస్తుంటారు. అందుకే వారి చూపు నేరుగా పంటపై పడకుండా అందమైన హీరోయిన్ల బొమ్మలు ఉంచాను.

-రెడ్డెప్ప, రైతు, నారేవారిపల్లె


బంతిపూలు, టమోటా తోటలలో పెట్టిన సినిమా హీరోయిన్‌ల చిత్రాలు

టమోటా తోటలో పెట్టిన దిష్టిబొమ్మ

గౌనివారిపల్లెలో దొంగల స్వైరవిహారం

రైతు ఇంట్లో 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదు చోరీ

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌనివారిపల్లెలో ఓ రైతు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.సుబ్బారెడ్డి వ్యవసాయంతో పాటు వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వ్యవసాయ పనుల నిమిత్తం భార్యాభర్తలిద్దరూ గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను పగలగొట్టి అందులోని 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదును చోరీ చేశారు. రైతు పొలం వద్ద పనులు ముగించుకుని ఇంటికి రావడంతో విషయం వెలుగుచూసింది. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. అలాగే క్లూస్ టీంను రప్పించి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. కాగా తన కుమారుడు బెంగళూరులో స్థలాన్ని కొనుగోలు చేయడంతో అతనికి ఇవ్వడానికి తనకు రావాల్సిన డబ్బును పలువురి వసూలు చేసి ఇంట్లో పెట్టుకున్నట్లు ఆ రైతు చెబుతున్నాడు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం కట్

● జీవో లేదని మూడేళ్ల తర్వాత కొర్రీ

● అప్పుడు లేని జీవో ఇప్పుడేంటని కోఆప్షన్ సభ్యుల ప్రశ్న

మదనపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలోని ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం నిలిపేస్తూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా మూడు నెలలుగా వేతనం రాకపోవడంపై సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గంలో చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లకు ప్రతినెలా ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తోంది. ఇందులో చైర్‌పర్సన్‌కు రూ.15 వేలు, వైస్‌చైర్మన్‌కు రూ.7,500, కౌన్సిలర్‌కు రూ.3,500, కో-ఆప్షన్‌సభ్యుడికి రూ.3,500 ఇస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రతినెలా సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహిస్తుంటారు. చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్ల తరహాలోనే కో-ఆప్షన్ సభ్యులు హాజరవుతుంటారు. వీరితో పాటు వీలునుబట్టి ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా హాజరవుతుంటారు. ఎమ్మెల్యే మినహా వీరందరితో పాటు కో-ఆప్షన్ సభ్యులకు ప్రతినెలా గౌరవ వేతనం ఇస్తున్నారు. సమావేశానికి హాజరైనట్లు మినిట్స్ పుస్తకంలో సంతకం చేస్తేనే దాని ఆధారంగా సీఎఫ్ఎంఎస్‌లో ఆన్‌లైన్ బిల్లు పెడితే, వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతోంది. ఇలా కౌన్సిల్ ఏర్పడిన మూడున్నరేళ్లుగా ఇదే జరుగుతోంది. కానీ మూడు నెలలుగా కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం రావడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం చెల్లించేలా జీవో లేదని, ప్రీ ఆడిట్ అభ్యంతరం చెబుతున్నట్లు కమిషనర్ ప్రమీల చెబుతున్నట్లు వారు వాపోతున్నారు.

తమకు ఇచ్చే రూ.3,500 కోసం కాదని, కో-ఆప్షన్ హోదాలో మున్సిపాలిటీ ఇచ్చే మర్యాదపూర్వకమైన వేతనం అంటూ సభ్యులు కె.జి.అబ్రహాం, కె.శ్రీదేవి, బి.శారదమ్మ చెబుతున్నారు. మూడున్నరేళ్లపాటు వచ్చిన వేతనం ఇప్పుడు రాకపోవడం ఏంటని? ఇన్ని రోజులు జీవో గుర్తుకురాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో జీవో నెంబరు-398, 1998 ప్రకారం చెల్లిస్తున్నారని సభ్యులు చెబుతున్నారు. దీనిపై కమిషనర్‌ను వివరణ కోరగా ఆడిట్ అభ్యంతరాలతో మూడునెలలుగా ఆపేసినట్లు తెలిపారు. వీరితో పాటు పెట్టిన కౌన్సిలర్లకు కూడా ఇబ్బంది అవుతుంటే కో-ఆప్షన్ సభ్యులకు నిలిపేసినట్లు కమిషనర్ వివరించారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ.24 లక్షల విలువైన 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారం స్వాధీనం

● మీడియాకు వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్


వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీలకు పాల్పడిన ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు, అభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపెట్టినట్లు చెప్పారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కడప జిల్లా అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన ప్రస్తుతం బద్వేల్ పట్టణంలోని గుంతపల్లిలో నివాసం ఉంటున్న గుమ్మాల వెంకటసుబ్బయ్య అతడి స్నేహితుడు రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన ప్రస్తుతం కడప నగరంలోని తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న గొర్లకుమార్ అలియాస్ అమర్ రాజ్‌కుమార్‌లు ఇరువురు కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఆగస్టు 18వ తేదీ రాత్రి సుండుపల్లె మండల కేంద్రంలో కెనరా బ్యాంకు వెనుక వైపున సాయినగర్, పద్మరాజునగర్‌లో రెండు చోట్ల చోరీకి పాల్పడ్డారని, అలాగే అదే నెల 31వ తేదీ రాత్రి సుండుపల్లె బస్టాండు సమీపంలో గల ఆర్ఎస్ జ్యువెలరీ షాప్‌లో చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు ఈ చోరీల ఘటనపై సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. నిందితులను ఇప్పటికే పలు చోరీల కేసుల్లో సిద్దవటం పోలీసులు అరెస్టు చేశారన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని విచారించగా సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలను రాయచోటి-సుండుపల్లె మార్గంలోని రాచంవాండ్లపల్లెకు సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా అటవీ ప్రాంతంలో పాతిపెట్టినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలియజేశారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన వివరించారు. తక్కువ సమయంలో చోరీ కేసును ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, సీసీఎస్ ఎస్ఐ రామక్రిష్టారెడ్డి, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

మిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం


నాగశ్వేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గుత్తి నాగశ్వేత కర్ణాటక బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎలిప్టిక్ కర్వ్ క్రిప్టోగ్రఫీ యూసింగ్ ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అర్రే' అనే అంశంపైన చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు. కాగా డాక్టరేట్ సాధించిన ఆమెను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అభినందించారు.

స్థల ఆక్రమణలపై జేసీకి ఫిర్యాదు


పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇతరులు కబ్జా చేస్తున్నారని పీలేరులోని పంచాయతీ పారిశుధ్య కార్మికులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నెం.1/16లో 2013లో ప్రభుత్వం 83 మంది పారిశుధ్య కార్మికులకు ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల కొంతమంది ఆ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని తమపై దాడులు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వరి పంట కోసే యంత్రం నడుపుతున్న డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కె.మారిముత్తు (21) తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా, వేపూరు తాలూకా, పెరయనేసలూరుగా తెలిసింది. గ్రామంలోని బి.రాధకు చెందిన వరి పొలంలో పంట కోసేందుకు హార్వెస్టర్ వాహనాన్ని అద్దెకు మాట్లాడుకున్నారు. వాహనం పైన అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను తప్పించడానికి ఉపయోగపడే ఇనుప పైపును ఉంచుకున్నారు. బుధవారం మారిముత్తు అదే పొలం మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లను గమనించకుండా వరి పంటను కోస్తుండగా పైనున్న ఇనుప పైపుకు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో పై నుంచి పడిపోయి మృతి చెందాడు. తమిళనాడు నుంచి మారిముత్తు తల్లిదండ్రులు గురువారం గ్రామానికి చేరుకుని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఎం.మహమ్మద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అవివాహితుడైన మారిముత్తుకు వయసుడిగిన తల్లిదండ్రులు, దివ్యాంగుడైన తమ్ముడు ఉన్నారని పోలీసులు తెలిపారు. శవ పరీక్ష అనంతరం మారిముత్తు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.



మహామర్రి



కడప నగర శివారులోని వాటర్‌గండి వద్ద రామలింగేశ్వరాలయం చెంతన మహా మర్రివృక్షం ఉంది. ఇక్కడి పెన్నా నది సందర్శనకు వెళ్లే పర్యాటకులు ఈ చెట్టుకింద సేదతీరుతుంటారు. ఎంతటి మండే ఎండల్లో అయినా ఇక్కడ చల్లగా ఉంటుంది. పక్కనే శివాలయం ఉండటంతో కార్తీక మాసంలో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఈ చెట్టుకు సుమారు 400 సంవత్సరాల వయసు ఉంటుందని ఆలయ పూజారి రోశయ్య తెలిపారు. చెట్టు విస్తరించే వీలులేకుండా ఒకవైపు ఆలయం మరోవైపు కొన్ని నిర్మాణాలు, ఇతర చెట్లు ఉన్నాయి. అయినా ఈ చెట్టుకు వందల సంఖ్యలో ఊడలు ఉండటంతో విశేషంగా ఆకట్టుకుంటోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

పాఠశాలల టైమింగ్స్‌లో మార్పు





కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల టైమింగ్స్ మార్పు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో అమలు చేసేందుకు 36 పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ నెల 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు కానుంది.

రాష్ట్రంలో పాఠశాలల టైమింగ్స్ మారనున్నాయి. కొత్త టైమింగ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ముందు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేయాలని ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల టైమింగ్స్ మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాత పనివేళలు వెయిటేజీతో పాటు ప్రతి పీరియడ్ సమయాన్ని మాత్రమే పెంచాలని స్పష్టం చేశారు. దీని ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు సిలబస్‌ను కవర్ చేయడానికి.. బోధన అభ్యసనా ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వనున్నారు. గతంలో ఉన్నత పాఠశాల పనివేళలు ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.40 వరకు కొనసాగుతుండేవి. వీటిపై ఉన్న ఇబ్బందులను గత పాలకులు పరిశీలించి పాఠశాల పనివేళలు ప్రాథమిక పాఠశాలలకనుగుణంగా మార్పు చేశారు. గత మూడేళ్లుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం పనివేళలు మార్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఇబ్బంది పడే అవకాశాలున్నాయని వాపోతున్నారు.

- పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాల
- జిల్లాలో 36 పాఠశాలలను సిద్ధం చేసిన విద్యాశాఖ
- ఈ నెల 25 నుంచి 30 వరకు అమలు

ఇవే సమస్యలు

పాఠశాల పనివేళలు మార్పు చేయడం ద్వారా రవాణా సౌకర్యం అందుబాటులోకి లేని చోట ఐదు కి.మీ పరిధి నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. డ్రాపవుట్ల శాతం కూడా పెరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల అనుకోని దుర్ఘటనలు కూడా సంభవించవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. మానసిక శాస్త్రం ప్రకారం విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఏడు గంటల పాటు పాఠశాలల్లో విద్యార్థులు ఉండడం ద్వారా మానసిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం కూడా ఉందని పలువురు చెబుతున్నారు.

పాఠశాలల సమయం ఇలా....

రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో సమయాన్ని పెంచేందుకు అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. యదావిధిగా ఉదయం 9గంటలకు ఫస్ట్ బెల్, 9.05కు సెకండ్ బెల్ ఉంటుంది. 9.25 వరకు 20 నిమిషాల పాటు ప్రార్థన ఉంటుంది. ఫస్ట్ పీరియడ్ 9.25 నుంచి 10.15 వరకు సెకండ్ పీరియడ్ 10.15 నుంచి 11 వరకు, 11 నుంచి 11.15 వరకు షార్ట్‌బ్రేక్ , 11.15 నుంచి 12 వరకు థర్డ్ పీరియడ్, 12 నుంచి 12.45 వరకు 4వ పీరియడ్, 12.45 నుంచి 1.45 వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. అనంతరం 1.45 నుంచి 2.30 వరకు ఐదో పీరియడ్, 2.30 నుంచి 3.15 వరకు 6వ పీరియడ్, 3.15 నుంచి 3.30 వరకు బ్రేక్, 3.30 నుంచి సాయంత్రం 4.15 వరకు 7వ పీరియడ్, 4.15 నుంచి 5గంటల వరకు 8వ పీరియడ్ జరగనుంది.

నవంబరు 30 వరకు పైలెట్ ప్రాజెక్టు

జిల్లాలో ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలలో నవంబరు 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు ప్రతి మండలం నుంచి ఒక హైస్కూలు ప్లస్‌ని గుర్తించి పాఠశాలల జాబితాను నవంబరు 20న పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ 36పాఠశాలలను గుర్తించి రాష్ట్రవిద్యాశాఖకు పంపించినట్లు సమాచారం.

ప్రారంభమైన పీజీ సెమిస్టరు పరీక్షలు



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ సెమిస్టరు పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. యూనివర్శిటీ ఆవరణలో ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో ప్రారంభమైన పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి క్రిష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసరు కాత్యాయని మాట్లాడుతూ పీజీ పరీక్షలకు తొలిరోజు 488 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు డిసెంబరు 4 వరకు కొనసాగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్‌లు డాక్టర్ లక్ష్మిప్రసాద్, డాక్టర్ మునికుమారి పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇషా ఫౌండేషన్ సారథ్యంలో గ్రామోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 24వ తేదీ ఆదివారం కడప డీఎస్‌ఏ మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ (పురుషులు) క్రీడా పోటీలు జరుగనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ప్రధానంగా గ్రామస్తులలో ఐక్యత, సంస్కృతిని మరింత పెంపొందింప చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని 13 జిల్లాలలో 16వ గ్రామోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి ప్రధానం చేస్తారన్నారు. జిల్లాలోని ఆసక్తిగల వాలీబాల్ క్రీడాకారులు తప్పక పోటీలలో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతిగా 9వేలు, ద్వితీయ విజేతకు 6వేలు, తృతీయ విజేతకు 2 వేలు అందజేస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులంతా ఒకే గ్రామం, లేదా ఒకే పట్టణ పంచాయతీకి చెంది వుండాలన్నారు. కాగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధి జట్లు అనర్హులన్నారు. కనీస వయస్సు 14 నుంచి వుండవచ్చన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇవ్వాలి

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే విక్రయించాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన ధరలు తగ్గించి బెల్టుషాపులను నియంత్రించాలని కోరారు. గురువారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందుబాబులకు శుభవార్త. రేట్లు తగ్గించి నాణ్యమైన మందు ఇస్తామని ఎన్నికలముందు చంద్రబాబు చేసిన ప్రచార వీడియోను ప్రెస్‌మీట్‌లో రాచమల్లు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నెన్నో హామీలు గుప్పించిన చంద్రబాబు గెలిచిన తరువాత ఇతరులను మోసం చేసినట్లే మందుబాబులను కూడా వంచించాడన్నారు. ఆయన చెప్పినట్లు ధరలు తగ్గించలేదని... అప్పుడు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాయన్నారు. అప్పటి డిస్టలరీలే ఇప్పుడు కూడా ఉన్నాయని ఆరోపించారు. నాడు అదే మద్యం విషం అని ప్రచారం చేశారు. మరి ఇప్పుడు అదే మద్యం ఎలా విక్రయిస్తున్నారని ప్రశ్నించారు ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం నాణ్యమైన మద్యం ఇవ్వాలని తెలిపారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి



సుమతి మృతదేహం

చాపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకానగరం గ్రామం వద్ద కడప కర్నూలు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మారిగాళ్ల సుమతి (17) అనే విద్యార్థిని మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. ద్వారకానగరం గ్రామానికి చెందిన సుమతి రోడ్డుకు అవతలివైపునకు వెళ్లి కొళాయి వద్ద బట్టలు ఉతుక్కుని తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుదాటుతుండగా.. మైదుకూరు నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమతి మైదుకూరులోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందాగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప వన్‌టౌన్ సర్కిల్ వద్ద బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో మహమ్మద్‌రఫి (32) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన మహ్మద్‌రఫి కొన్నేళ్లక్రితం కడపకు వచ్చి వైవీ స్ట్రీట్‌లోని బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి... కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కడప ఎర్రముక్కపల్లెకు చెందిన డాక్టర్ రాహుల్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో బుధవారం రాత్రి వెళుతుండగా సీఎస్‌ఐ చర్చి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాదుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కువైత్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి


పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం కువైత్ వెళ్లిన మస్తాన్‌వల్లి (40) గుండెపోటు రావడంతో మూడు రోజుల కిందట మృతి చెందాడు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తెప్పించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పెనగలూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన మస్తాన్‌వల్లి యేడాది కిందట భార్యబిడ్డలను వదిలి కుటుం బ పోషణ కోసం కువైత్ వెళ్లాడు. అక్కడ షేర్ ఇంటిలో ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల కిందట చాతిలో తీవ్రంగా నొప్పి వస్తుందని కువైత్‌లో ఉన్న బంధువులకు తెలపడంతో వారు షేర్ ఇంటివద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే అతని యజమానులు ఆసుపత్రికి తరలిస్తుండగా మస్తాన్‌వలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మస్తాన్‌వల్లి మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సమీపంలోని ఎస్ఆర్ పాలెం అటవీ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు పట్టుకుని ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు చిరంజీవులు, నరేష్, కిరణ్‌కుమార్‌లు కలిసి ఎస్ఆర్ పాలెంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎర్రచందనం దుంగలు మోసుకువస్తున్న ఇరువురు నిందితులను పట్టుకుని దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

5 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



వల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెరువుకిందపల్లె పాపాఘ్ని నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకుని.. జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఇసుకను తమ కార్యాలయ అవరణలో డంప్ చేశామని.. ఎవరైనా ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు : ఎస్టీఎఫ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనివేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. గురువారం ఎస్టీఎఫ్ జిల్లాకార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో అగ్రస్థానంలో ఉన్న కేరళతో పాటు మరికొన్ని పాఠశాలలు ఉదయం 10 గంటల నుంచి 4గంటల వరకు కొనసాగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో పనివేళలు పెంచడానికి గల కార ణం ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పనివేళలు విద్యార్థుల్లో అభ్యసనా సంసిద్ధత మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు వంటి అనేక అంశాలకు ముడిపడి ఉంటాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతం నుంచి వస్తుంటారు కాబట్టి రవాణా సౌకర్యంలో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల పనివేళలను యదావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రసాద్, ఎల్‌వీ శంకర్ పాల్గొన్నారు

పోక్సో కేసు నమోదు

సీకేదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యా చాచానికి పాల్పడిన ముగ్గురిపై పోక్సో కేసు నమోదైనట్లు సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామం లో నెల రోజుల క్రితం ఓ బాలికపై ఇద్దరు అత్యాచారం చేశా రు. వారిద్దరితో పాటు మరో మైనర్ బాలుడు ఉన్నాడు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేటకు చెందిన బోనాల బ్రహ్మయ్య (46) అదృశ్యమయ్యాడు. ఈనెల 1వ తేదీ సాయంత్రం మద్యం తాగి భార్య గోవిందమ్మతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆ రోజు నుండి ఇప్పటి వరకు ఇంటికితిరిగి రాలేదని.. సెల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు అతని తండ్రి ఈశ్వరయ్య అర్బన్ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

24 నుంచి అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. కడపలో గల ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కోఓఆర్ఎం మైదానాలలో మ్యాచ్‌లు జరుగనున్నాయన్నారు.

భూమి విలువ పెంచుతాం: ఆర్డీఓ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ భానుశ్రీ

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కోసం తీసుకున్న భూమి విలువ 1.25 శాతం పెంచుతామని ఆర్డీఓ భానుశ్రీ అన్నారు. గురువారం వీరపునాయునిపల్లె, ఎస్.పాలగిరి, తంగేడుపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులకు నేలతిమ్మాయపల్లెలో నిర్వహించిన గ్రామసభకు ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ రహదారికి సైడ్ భూమి విలువ రూ.11.90లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈవిషయమై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడమే గ్రామసభ ఉద్దేశ్యమన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం వీరపునాయునిపల్లె జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు గవేశ్వరయాదవ్ అధ్యక్షతన బీజేపీ క్రియాశీలక సభ్యుల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సత్తా నిరూపించాలంటే సంస్థాగతంగా బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి ప్రజలకు చేరువకావాలన్నారు. జిల్లా క్రియాశీలక ఇన్‌చార్జి శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి, గండిగంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో

నకిలీ చలానాలు

- సృష్టించిన మున్సిపల్ సర్వేయర్
- కమిషనర్ సంతకం సైతం ఫోర్జరీ
- మున్సిపల్ ఆదాయానికి గండికొట్టిన వైనం
- మెమో జారీ చేసిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలి టీని అవినీతి చీడ ఎంతకూ వదలనంటోంది. ఇంతవరకు మున్సిపాలిటీలో ఏదైనా పనిచేయడానికి పర్సెంటేజీల వంతున మామూళ్లు తీసుకునేవారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్‌లో ఉన్న సర్వేయర్ ఏకంగా మున్సిపాలిటీకి కట్టవలసిన చలానాలనే నకిలీవి సృష్టించి మరీ మున్సిపాలిటీ సొమ్ము స్వాహా చేశాడు. వివరాలిలా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఏడాది క్రితం మున్సిపల్ సర్వేయర్‌గా కృష్ణకిశోర్ వచ్చినప్పటి నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి సర్వే నెంబరు కోసం వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇచ్చే ధ్రువీకరణ పత్రంకోసం ఆ స్థలం విలువను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అయితే నిర్దిష్టంగా అతనిపై ఇంతకాలం ఫిర్యాదులు రాలేదు. ఇటీవల ఒక సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం కొందరు దరఖాస్తు చేసి మున్సిపాలిటీకి చెల్లించవలసిన చలానా రూ.1000తో పాటు సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మరో రూ.5వేలు లంచంగా ఇచ్చారు. కానీ పనిచేయడంలో ఆలస్యం కావడంతో ఆ విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మున్సిపల్ సర్వేయర్ సర్వేనెంబరు కోసం పెట్టిన ఫైల్స్‌ను తెప్పించి పరిశీలించారు. ఈ దరఖాస్తుకు చలానాలు కట్టారా లేదా అని పౌరసేవా కేంద్రంలోని క్యాష్ కౌంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అక్కడ సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం చలానాలు కట్టినట్లు రికార్డులో లేదు. కానీ ఈ చలానాలు ఎలా వచ్చాయి.. అని వాటిని నిశితంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలిపోయింది. చలానాల్లో క్యాషియర్ సంతకాలు సైతం లేకపోవడం కమిషనర్ సంతకం కూడా ఫోర్జరీ ఉండటం గుర్తించారు. కొద్దిరోజుల రికార్డు చెక్ చేస్తేనే 20 నకిలీ చలానాలు బహిర్గతమయ్యాయి. ఇంకా అతను పనిచేసిన దినాల్లో జారీ చేసిన సర్వే నెంబర్ల ధ్రువీకరణ పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే పూర్తి స్థాయిలో ఎన్ని నకిలీ చలానాలు సృష్టించాడో వెల్లడవుతుంది. ఈ నకిలీ చలానాలపై సంజాయిషీ కోరుతూ గురువారం మున్సిపల్ సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మెమో ఇచ్చారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మున్సిపల్ సర్వేయర్ నకిలీ చలానాలు సృష్టించినట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవమని అన్నారు. వాటిని రికార్డు పరంగా పరిశీలించి గుర్తించామన్నారు.. నకిలీ చలానాలతో పాటు కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయడంతో అతనిపై ఎందుకు చర్య తీసుకోకూడదో ఒక్కరోజులో వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నట్లు తెలిపారు. ఆయన ఇచ్చిన వివరణ ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి

● డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు రాయచోటి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీఈఓ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం దాత, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ తన వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ రోజు విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ షేక్.మహమ్మద్, డిస్ట్రిక్ చైర్మన్ హరీష్ చంద్ర, డైట్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అధ్యాపకులు శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, నాగరాజ, అసదుల్లా, రెడ్డెయ్య, భరత్‌రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోండి

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తగా పక్కాగృహాలు కావాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలని రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ హౌసింగ్ శాఖ డీఈఈ కె.మురళీక్రిష్ణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా కొత్త పక్కాగృహాలు కావాలసిన వారు పీఎంఏవై పథకం కింద సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

టీడీపీకి కార్యకర్తలే బలం

చిన్నమండెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలం అని ఐటీడీపీ రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మహేందర్ నాయుడు అన్నారు. గురువారం ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కలిబండలో నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ చాంఫియన్స్ మాధవరం రాంమోహన్, పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సుబ్బనరసయ్య



రాజంపేటటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్రీధర్‌కు రాజంపేట సమస్యలపై టీడీపీ మండల అధ్యక్షుడు గన్నె సబ్బనరసయ్య గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజంపేట డీఎస్పీ కార్యాలయం పట్టణానికి దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనాల్లో ఉన్న విషయాలపై చర్చించారు. ఈయన వెంట టీడీపీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కరీం తదితరులు ఉన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ

● నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



రాయచోటి కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది కన్నన్‌పై కోర్టు ఆవరణంలోనే అత్యంత దారుణంగా కొడవలితో దాడి చేసి చంపే ప్రయత్నం చేసిన దంపతులు ఆనందన్, సత్యవతిలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్యలు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా గురువారం రాయచోటి న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. అలాగే న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి నాగముని, న్యాయవాదులు రవివంకర్, నరసింహారెడ్డి, రామాంజనేయులు, రాజమనోహర్ పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌తో భేటీ



సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయిలోకేశ్

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు విక్రమసింహా ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్ కలిసి అభినందించారు. సీనియర్ బీజేపీ నాయకుడిగా, జాతీయ కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన సురేష్‌రెడ్డికి ఆర్టీసీ చైర్మన్‌గా నియమించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, చిట్వేలి మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని పశువులకు పశువైద్యాధికారులు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశుసంవర్థకశాఖ ఉప సంచాలకుడు వై.విజయభాస్కర్‌రావు, ఉపసంచాలకుడు కె.ప్రతాప్‌ల ఆధ్వర్యంలో ఈ టీకా మందులు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వరదయ్య, బసవరాజు, హరిబాబు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల విధి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ఒంటిమిట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల విధి అని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేపట్టారు. సర్కిల్ పరిధిలోని నేరాల తీవ్రతపై స్థానిక అధికారులను అడిగి వివరాలు సేకరించారు. మండలంలో ఎర్రచందనం, ఇసుక, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించి ఫిర్యాదులను స్వీకరించి సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. భార్యాభర్తలకు పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ చేపట్టాలని, ఇరువురికి సర్దిచెప్పి కౌన్సెలింగ్ చేపట్టడం ద్వారా ఫ్యామిలీ సమస్యలను పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి- ప్రాణాలు కాపాడుకోండి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని యువత హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు అన్నారు. రాయచోటిలోని చిత్తూరు రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుబ్బరాయుడు, అనిల్‌లు మాట్లాడుతూ 14 సంవత్సరాల యువతకు బైకులు ఇవ్వడం చాలా నేరమన్నారు. కారు, మోటారు బైక్ నడిపే ప్రతి వ్యక్తి లైసెన్సు తప్పనిసరిగా పొంది ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, ఉపన్యాసకులు గుర్రప్ప, కిరణ్‌కుమార్, ఎంవీఐలు అజయ్‌కుమార్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిట్వేలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి - నెల్లూరు ప్రధాన రహదారి గట్టు మీదపల్లె వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... ఎం.రాచపల్లె ఎస్టీ కాలనీకి చెందిన యాకసిరి పెంచలమ్మ(45) మృతిచెందింది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఎం.రాచపల్లె ఎస్టీ కాలనీకి చెందిన పెంచలమ్మ బంధువులతో కలిసి ఏపీ39కె 9523 నంబరు గల మోటారుబైకులో రాజంపేట వైపు వెళుతుండగా అదే సమయంలో రాపూరు వైపు వెళుతున్న ఏపీ28టీ 4257 నంబరు గల లారీ ఢీకొనడంతో పెంచలమ్మ కిందపడి తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా ఆమెతోపాటు వస్తున్న గంగాదేవికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకేపాడు పాఠశాల తనిఖీ

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం జడ్పీ ఉన్నత పాఠశాలను ఉప విద్యాధికారి శివప్రకాష్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని క్లాసులకు వెళ్లి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి కష్టపడి చదవాలని కోరారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో క్రమశిక్షణ, ఉన్నత విద్యా ప్రమాణాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

సంబేపల్లె, నవంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం 57వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేకోడూరులో ఎస్ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటోలు, మోటారు సైకిళ్లు, జీపులు, వ్యాన్లు తదితర వాటిని తనిఖీలు చేశామని తెలిపారు.

నాలుగు గ్రామాల దత్తతకు ఏర్పాట్లు

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) రాజంపేట మండలం తాళ్లపాక పరిధిలోని 4 గ్రామాలను అభివృద్ధి చేయడానికి గ్లోబల్ చారిటబుల్ చైర్మన్ డాక్టర్ పండేటి భూపతిరాజు నిర్ణయించినట్లు రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రాజు పేర్కొన్నారు. ఈ మేరకు భూపతిరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుకపల్లె, హెచ్.చెర్లోపల్లె, తాళ్లపాక, ఎంజీపురం గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, డాక్టర్ రవిరాజు, అంజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

నందలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామం ఎర్రచెరువుకట్టపై వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం, అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అత్యంత ఘనంగా జరిగింది. ఈ గ్రామోత్సవంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జనసేన నేతల ఆత్మీయ సమావేశం

రాయచోటిటౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం జనసేన పార్టీ నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు రామాశ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో రాయచోటి చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన నాయకులు జయరామ్, రెడ్డిప్రసాద్ నాయుడు, ప్రదీప్, దినేశ్, చరణ్, బుల్లెట్ విజయ్, వెంకటేశ్, జనసైనికులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

● తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చారంటూ ఫిర్యాదు



ఆవేదన చెందుతున్న మహిళ

గాలివీడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి మరణానికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జయనీలావతి అనే మహిళ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని తూముకుంట పంచాయతీ కొండకిందపల్లెకు చెందిన తన తండ్రి అవులపట్టి బసప్పనాయుడుకు 8 మంది సంతానం కాగా, తాను చివరి సంతానం అని తెలిపారు. అయితే తన తండ్రికి మగసంతానం లేనందున తన భర్త వెంకటాద్రినాయుడును ఇల్లరికానికి తెచ్చుకున్నాడని, అప్పటి నుంచి తన తల్లిదండ్రుల బాగోగులు తామే చూసుకుంటూ ఉండినామన్నారు. ఇందుకు గానూ తన తండ్రి బసప్పనాయుడు తన పేరిట కొంత భూమి ఇస్తున్నట్లు వీలునామా రాశాడని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ భూమిని తామే సాగుచేసుకుంటూ ఉండినామన్నారు. కాగా 2001 ఫిబ్రవరి 11న తన తండ్రి మృతి చెందాడని, కానీ తమ బంధువులు భూమిని కాజేసేందుకు వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 2000 సంవత్సరం ఫిబ్రవరి 25న మృతి చెందినట్లు రికార్డుల్లో తారుమారు చేసి తన తండ్రి మరణానికి సంబంధించి తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారని ఆరోపించారు. ఈ సర్టిఫికెట్ చూపుతూ తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని, ఈ విషయంపై రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం దక్కలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రాయచోటి ఆర్డీఓకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

కలెక్టర్‌తో జీఎన్ నాయుడు భేటీ



కలెక్టర్ శ్రీధర్‌తో భేటీ అయిన జీఎన్ నాయుడు

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టీడీపీ సీనియర్ నాయకుడు, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు గురువారం రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేటకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. ప్రధానంగా రాజంపేట పట్టణంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈనెల 24న తమ రీజెన్సీ నలందా విద్యాలయానికి చెందిన సుమారు 500 మంది విద్యార్థులచే పట్టణంలోని పారిశుధ్యంపై దృష్టి సారించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి కలెక్టర్‌ను ఆహ్వానించగా ఆయన వస్తున్నట్లు తెలియజేశారని జీఎన్ నాయుడు తెలిపారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. దాత బోడేపల్లె సుబ్బరాయుడు అనే శివ భక్తుడు రూ.1.20 లక్షల వ్యవయంతో ఈ విగ్రహాలను తయారు చేయించారు. వేద పండితులు ప్రసాద్‌శర్మ, ఆలయ అర్చకులు దూర్జటి యోగీ, పృధ్వీ, మనోజ్‌లు.. లింగోద్భవమూర్తి, బ్రహ్మ, ఆంజనేయుడు, వారాహిదేవి, సరస్వతిదేవి, అయ్యప్పస్వామి, దత్తాత్రేయ, ఆదిశంకరాచార్యులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొదట హోమాలు చేసిన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, లక్ష్మీదేవి, శివ భక్తులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, బలరామయ్య, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాయవరం మీదుగా బస్సు

సుండుపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి సుండుపల్లె-తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సు రాయవరం మీదుగా వెళ్తుందని ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఈ మధ్య వినతిపత్రం అందజేయడంతో ఆయన స్పందించారు. మండలం నుంచి ఉదయం 5 గంటలకు వెళ్లే బస్సు రాయవరానికి వెళ్లి తిరుపతికి వెళతుండగా అలాగే రాత్రి 9 గంటల సమయంలో సుండుపల్లెకు వచ్చే బస్సు అదే విధంగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రస్తా విషయమై రైతు ఫిర్యాదు

● విచారణ చేపట్టిన రెవెన్యూ సిబ్బంది



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన భూమి రస్తాను కొందరు ఆక్రమించుకొని ఏకంగా గేటు ఏర్పాటు చేశారని రైతు హర్షసింహా అధికారులకు ఫిర్యాదు చేశారు. సిద్దవటం గ్రామ రెవెన్యూ పొలం సర్వేనంబరు 36లో రైతుకు కొంత భూమి ఉంది. ఈ భూమి రస్తాలో కొందరు గేటు ఏర్పాటు చేసుకోవడంతో తమకు న్యాయం కావాలని ఈనెల 18న కడప కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఇందులో ఇతరులకు ఎటువంటి హక్కు లేదని, రస్తా రైతుకు సంబంధించినదేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కేశవులు, సచివాలయం సర్వేయర్ పురుషోత్తమరెడ్డి, వీఆర్‌ఏ వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి వార్షికోత్సవం



స్వాములవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గాలివీడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరంపల్లె పంచాయతీ తాతిరెడ్డిగారిపల్లె సమీపంలో నిర్మితమైన వీరాంజనేయ, వాయులింగేశ్వర, సాయిబాబా ఆలయాల సమూహాల దేవాలయ ప్రాంగణంలో ఘనంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. తాతిరెడ్డి వినీతరెడ్డి, వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి డిసెంబరు 2వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా రెండవ రోజు గురువారం స్వాముల వారికి సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి స్వాముల వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, దేవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సన్నాహక సమావేశం

ఓబులవారిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట, నీరుంపల్లె దేవాలయంలో హైందవ శంఖారావం సన్నాహక సమావేశం గురువారం జరిగింది. బీజేపీ నియోజకవర్గ నాయకుడు గడ్డం చెంగల్‌రాజు, పులపత్తూరు రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో కొర్లకుంట, వై.కోట, చెన్నరాజుపోడు, మంగంపేట, గోవిందంపల్లె, బాలిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన వీహెచ్‌పీఆర్‌ఎస్‌ఎఫ్, బీజేపీ కార్యకర్తలు, హిందూ బంధువులు, సుమారు 30 మంది హాజరై విజయవాడలో జనవరి 5న తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగసభ విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యే సోమిరెడ్డి



బంధువులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో జరిగిన కర్మక్రియలకు నెల్లూరు జిల్లా సర్వేపల్లె ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు. తంబిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పంజం సందీప్‌రెడ్డి తండ్రి అమర్‌నాథ్‌రెడ్డి కర్మక్రియలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం బంధువులతో మాట్లాడారు. కాగా సోమిరెడ్డి.. పంజం సందీప్‌రెడ్డికి సమీప బంధువు కావడంతో హాజరైనట్లు స్థానికులు తెలిపారు.

గంగమ్మగుడి వద్ద కార్తీక దీపం

ఒంటిమిట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక నడివీధి గంగమ్మ వద్ద కార్తీక దీపోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానికంగా ఉన్న మహిళలు పెద్దఎత్తున గంగమ్మ గుడి వద్దకు చేరుకుని దీపోత్సవాలకు ముస్తాబు చేశారు. ముందుగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంత్‌స్వామి, గ్రామ పెద్దలు వెంకటసుబ్బయ్య, కల్లా ఎల్లయ్య, మన్నేరు నరసయ్య, రమణ, ఎల్ఐసీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన



అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం మద్యాల గ్రామం, [illegible] శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయమును [illegible] (ఆలయ ట్రస్టీ అధ్యక్షు) విజ్ఞప్తి మేరకు దేవాదాయ చట్టం 30/87 ప్రకారం పబ్లికేషన్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ గారు ఒక ప్రకటన ఇచ్చారు. సదరు రిజిస్ట్రేషన్‌పై ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఏడు రోజుల లోపల అన్నమయ్య జిల్లా రాయచోటిలోని దేవాదాయ శాఖ జిల్లా అధికారి, విశ్వనాథ సార్ గారికి లిఖితపూర్వకముగా తెలియజేయాలని విన్నవించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Rly. Kodur Branch, Rly. Kodur Post & Mandal, Annamaiah Dt. A.P. I hereby given the public notice that **Smt. Manneru Sujatha W/o Srinadh,** D.No.7/60-D2H, Balijapalle Road, Rajampet Post, Mandal, Annamaiah Dist. A.P. has applied for a loan from my clients Finance Ltd., by mortgaging the schedule mentioned property which stands in his name. If anybody has got any objections with regard to the schedule mentioned property, file their objections before my clients Office or in my Office within 07 days of this publication, failing which loan will be sanctioned and issued to the applicant. **SCHEDULE**: The vacant site is situated at Kadapa Dist. Rajampet Sub.Dist., Rajampet Municipality, 7th Ward, Balijapalle area, near to the house bearing D.No. 7/82-J, vacant site in Survey No. 514 an extent of Ac. 0.03 cents or 145.2 Chadarapu Gajamulu of Vacant Site. **Boundaries :** East : Site of Reddicherla Rajanna, West : Site of Dasatagiri, North : Site of Guggilla Nagaratnamma South : Muncipality Road **Measurements** : East to West : Northern Side : 20 Links or 19.8 Feet or 6.00 Mtrs. Southern Side : 30 Links or 19.8 Feet or 6.00 mtrs., North to South : Eastern Side : 100 Links or 60 Feet or 10. Mtrs Western Side : 100 Links or 66 Feet or 20 Mts.) Total an extent of 0.03 cents or 145.2 Chadarapu Gajamulu of Vacant Site

S. KRISHNA KUMAR, M.A., B.L.
S. GIREESH KUMAR, M.Tech. LLM
Advocates, Rajampet

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట

H.M.O.P. No. 51/2024

చల్లా గంగాధర్ యాదవ్ తండ్రి గంగయ్య, గుండాలపల్లి విలేజ్, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా. - Petitioner

V/s

చల్లా స్రవంతి భర్త గంగాధర్ యాదవ్ తండ్రి నుశెట్టి చంద్రా యాదవ్, బొల్లావాండ్లపల్లి గ్రామం, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా -Respondent

పైన తెలిపిన పిటీషనర్ విడాకులు కోరుతూ మీపై పైకోర్టులో పై పిటీషన్ దాఖలుచేసియున్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని పై కోర్టులో **18-12-2024** తేదీన ఉదయం **10.30** గంటలకు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

బై ఆర్డర్ ఆఫ్ ద కోర్ట్
జి. సురేంద్ర, అడ్వకేట్ రాజంపేట

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Kodidala Nagaraja** S/o **K.Subbarayudu** R/o D.No. 2-48, Veeraballi Road, Masapeta Village, Post, Rayachoty Mandal Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY:**-Annamayya Dist. erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal & Municipality at Kasba Gollapalli Village Polam in **Sy. No. 1/1C2, 1C3,** Vijayakethana Paradise Homes Apartment semi finished (East face Flat No. 301 in Third Floor) having D.No. 5/143-1-1/VKPH/301 with assessment no. 1121447456 admeasuring 1170.72 sq. feets (including common area and car parking area) situated in building Vijayakethana Paradise Homes Apartment **Bounded by:** East - Corridor, West - Set back Area open to sky, North - Totlot Area open to sky, South - Set back area open to Sky. Along with doors, doorframes, windows, almaras and all fitting attached to the building with easementary right. Property covered under registered sale deed No. 6167/2024 S.R.O. Rayachoty)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L.,
ADVOCATE, Rayachoty, 9441738746

యువత 'ఉన్నతి'కి శిక్షణ

● ఉపాధి కూలీల కుటుంబాలకు ప్రోత్సాహం ● శిక్షణ కాలంలో ఆర్థిక ప్రయోజనం

కడప (ఎన్టీఆర్‌సర్కిల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా శిక్షణ ఇచ్చి వివిధ రకాల జీవనోపాధుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యం వచ్చేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే వారి పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలోని యువతకు శిక్షణ ఇస్తున్నారు. అర్హులైన కుటుంబంలో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారిని గుర్తించి వారి ఆసక్తి మేరకు పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందులలో న్యాక్ సెంటరు, కడపలో టీటీడీసీ, రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.




పులివెందులలో సర్వేయరు, సోలార్ పీవీ మ్యాడ్వెల్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఏసీ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఇక్కడి శిక్షణ కేంద్రం డెకాన్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా కడపలోని టీటీడీసీలో ఉన్న స్కిల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ స్టోరు మేనేజరు అండ్ రిటైల్ సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. రాజంపేటలోని గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలపరిమితి 90 నుంచి 120 రోజులు ఉంటుంది. శిక్షణా కాలంలో రోజు కూలీ రూ.300 చొప్పున 90 రోజులకు శిక్షణ కాలానికి సుమారు రూ.27 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. కోర్సుకు అవసరమైన మెటీరియల్‌తో పాటు స్త్రీ, పురుషులకు యూనిఫాం ఉచితంగా హాస్టలు వసతి కూడా కల్పిస్తున్నారు. హైస్పీడ్ ఇంటర్‌నెట్ ల్యాబ్ కూడా అందుబాటులో ఉంటుంది. శిక్షణ అనంతరం ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ప్రైవేటురంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఎంపిక ఇలా..

ఉపాధి పథకంలో వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్న వారి వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వాటిని డీఆర్‌డీఏ, సీడాప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేసి వంద రోజులు పని చేసిన వారి అభిప్రాయాలను సేకరిస్తారు. ఇందులో వారి కుటుంబంలో ఎవరైనా చదువుకున్న యువత ఉంటే వారి ఆసక్తిని బట్టి స్వయం ఉపాధి కల్పనకు శిక్షణ ఇస్తారు. జిల్లాలో ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 18,962 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గుర్తించారు. వీరి కుటుంబాల్లో 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపనున్నారు. ఈ మేరకు ఇప్పటికే తొలివిడత శిక్షణ ప్రారంభమైంది.

ఉన్నతికి ఉచిత శిక్షణ ఇస్తున్నాం



ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వారికి మరింత మెరుగైన జీవనోపాధుల కోసం వారి కుటుంబంలో చదువుకున్న పిల్లలకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పుడిప్పుడే ఈ కార్యక్రమం ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. డ్వామా పీడీతో మాట్లాడి మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ

సేల్స్ రంగంలో ఉద్యోగం కావాలి



మాది నిరుపేద కుటుంబం. కూలీ వల్లనే జీవనం. ఉపాధి హామీ పథకం ద్వారా మా తల్లిదండ్రులు పనులకెళ్లేవారు. నేను బీకాం వరకు చదివాను. ప్రభు త్వ ఉద్యోగం వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఉపాధి హామీ కూలీల పిల్లలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారని తెలిసింది. ప్రస్తుతం టీటీడీసీలో శిక్షణ పొందుతున్నాను. సేల్స్ రంగంలో ఉద్యోగం చేయాలన్నది నా కోరిక.

- కె.సుకన్య, గంగనపల్లె, కాశినాయన మండలం

రిటైల్ రంగంలో శిక్షణ తీసుకుంటున్నా



మా తల్లిదండ్రులతో పాటు నేను కూడా ఉపాధి హామీ పనికి వెళ్లేవాడిని. ఇంటర్ వరకు చదువుకున్నాను. వందరోజుల పనిదినాలు పూర్తి కావడంతో ఉన్నతి ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని జాబ్ కో-ఆర్డినేటరు నరసింహులు ద్వారా తెలుసుకుని టీటీడీసీలో శిక్షణ తీసుకుంటున్నా. దూర ప్రాంతంలో అయినా సరే రిటైల్ రంగంలో ఉపాధి దొరికితే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను.

- వై.రామసుబ్బయ్య, ఎత్తిరాజులపల్లె, బద్వేలు మండలం

దిష్టి తగలకుండా...

● పొలంలో హీరోయిన్ల చిత్రాలు

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరదిష్టికి నల్ల రాయి అయినా పగులుతుందనేది పెద్దల నానుడి. దిష్టి పోవడానికి పురాతన కాలం నుంచి పలు రకాల బొమ్మలు పొలాల్లో పెడుతుంటారు. చిన్న పాపలకు బుగ్గలపై నల్ల చుక్క, ఇంటికి దిష్టి తగలకుండా దిష్టిబొమ్మలు కట్టడం, పొలాల్లో కుండకు తెల్లని చుక్కలు పెట్టి ఉంచడం, మనిషి ఆకారంలో బొమ్మలు ఉంచడం పాత పద్ధతులు. అయితే నేటి యువత వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి వినూత్నమైన వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇందులో భాగంగా పంటలకు దిష్టి తగలకుండా ఇతరుల చూపు పంట పొలాలపై నేరుగా పడకుండా పొలాలలో అందమైన హీరోయిన్ల చిత్రాలు పెట్టి నరదిష్టి తగలకుండా చూస్తున్నారు.

మండలంలోని నారేవారిపల్లెకు చెందిన రైతు రెడ్డెప్ప తాను సాగు చేసిన టమోటా, బంతిపూల తోటలో అందమైన హీరోయిన్ల బొమ్మలు పెట్టాడు. దీంతో ఈ దారిలో వెళుతున్న వారి దృష్టి పంటపై కాకుండా హీరోయిన్ల చిత్రాలపై పడుతుందని దీంతో పంటకు దిష్టి తగలకుండా ఉంటుందని ఆ రైతు చెబుతున్నాడు. ఏదేమైనా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవడానికి రైతులు విభిన్న ప్రయోగాలు చేస్తున్నారు.

చూపరుల దృష్టి పంటపై పడకుండా..



నాకు రోడ్డు పక్కనే రెండు ఎకరాల పొలం ఉంది. ఇందులో ఎకరం టమోటా, ఇంకో ఎకరంలో బంతి పూలు తోట సాగు చేశాను. పూల తోట, టమోటా తోటలు పంట బాగా పండాయి. రోడ్డు పక్కన వెళ్లే వారు పంటను చూసి బాగా పండిందని చూస్తుంటారు. అందుకే వారి చూపు నేరుగా పంటపై పడకుండా అందమైన హీరోయిన్ల బొమ్మలు ఉంచాను.

-రెడ్డెప్ప, రైతు, నారేవారిపల్లె



బంతిపూలు, టమోటా తోటలలో పెట్టిన సినిమా హీరోయిన్‌ల చిత్రాలు



టమోటా తోటలో పెట్టిన దిష్టిబొమ్మ

గౌనివారిపల్లెలో దొంగల స్వైరవిహారం

రైతు ఇంట్లో 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదు చోరీ

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌనివారిపల్లెలో ఓ రైతు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన ఎం.సుబ్బారెడ్డి వ్యవసాయంతో పాటు వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వ్యవసాయ పనుల నిమిత్తం భార్యాభర్తలిద్దరూ గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను పగలగొట్టి అందులోని 150 గ్రాముల బంగారు, రూ.5 లక్షల నగదును చోరీ చేశారు. రైతు పొలం వద్ద పనులు ముగించుకుని ఇంటికి రావడంతో విషయం వెలుగుచూసింది. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో రూరల్ సీఐ రమేష్, ఎస్‌ఐ దిలీప్‌కమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. అలాగే క్లూస్ టీంను రప్పించి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. కాగా తన కుమారుడు బెంగళూరులో స్థలాన్ని కొనుగోలు చేయడంతో అతనికి ఇవ్వడానికి తనకు రావాల్సిన డబ్బును పలువురి వసూలు చేసి ఇంట్లో పెట్టుకున్నట్లు ఆ రైతు చెబుతున్నాడు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం కట్

● జీవో లేదని మూడేళ్ల తర్వాత కొర్రీ
● అప్పుడు లేని జీవో ఇప్పుడేంటని కోఆప్షన్ సభ్యుల ప్రశ్న

మదనపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలోని ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం నిలిపేస్తూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా మూడు నెలలుగా వేతనం రాకపోవడంపై సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గంలో చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లకు ప్రతినెలా ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తోంది. ఇందులో చైర్‌పర్సన్‌కు రూ.15 వేలు, వైస్‌చైర్మన్‌కు రూ.7,500, కౌన్సిలర్‌కు రూ.3,500, కో-ఆప్షన్‌సభ్యుడికి రూ.3,500 ఇస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రతినెలా సాధారణ, అత్యవసర సమావేశం నిర్వహిస్తుంటారు. చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్ల తరహాలోనే కో-ఆప్షన్ సభ్యులు హాజరవుతుంటారు. వీరితో పాటు వీలునుబట్టి ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా హాజరవుతుంటారు. ఎమ్మెల్యే మినహా వీరందరితో పాటు కో-ఆప్షన్ సభ్యులకు ప్రతి నెలా గౌరవ వేతనం ఇస్తున్నారు. సమావేశానికి హాజరైనట్లు మినిట్స్ పుస్తకంలో సంతకం చేస్తేనే దాని ఆధారంగా సీఎఫ్ఎంఎస్‌లో ఆన్‌లైన్ బిల్లు పెడితే, వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతోంది. ఇలా కౌన్సిల్ ఏర్పడిన మూడున్నరేళ్లుగా ఇదే జరుగుతోంది. కానీ మూడు నెలలుగా కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం రావడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే కో-ఆప్షన్ సభ్యులకు గౌరవవేతనం చెల్లించేలా జీవో లేదని, ప్రీ ఆడిట్ అభ్యంతరం చెబుతున్నట్లు కమిషనర్ ప్రమీల చెబుతున్నట్లు వారు వాపోతున్నారు.

తమకు ఇచ్చే రూ.3,500 కోసం కాదని, కో-ఆప్షన్ హోదాలో మున్సిపాలిటీ ఇచ్చే మర్యాదపూర్వకమైన వేతనం అంటూ సభ్యులు కె.జి.అబ్రహాం, కె.శ్రీదేవి, బి.శారదమ్మ చెబుతున్నారు. మూడున్నరేళ్లపాటు వచ్చిన వేతనం ఇప్పుడు రాకపోవడం ఏంటని? ఇన్ని రోజులు జీవో గుర్తుకురాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో జీవో నెంబరు-398, 1998 ప్రకారం చెల్లిస్తున్నారని సభ్యులు చెబుతున్నారు. దీనిపై కమిషనర్‌ను వివరణ కోరగా ఆడిట్ అభ్యంతరాలతో మూడునెలలుగా ఆపేసినట్లు తెలిపారు. వీరితో పాటు పెట్టిన కౌన్సిలర్లకు కూడా ఇబ్బంది అవుతుంటే కో-ఆప్షన్ సభ్యులకు నిలిపేసినట్లు కమిషనర్ వివరించారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

● రూ.24 లక్షల విలువైన 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారం స్వాధీనం
● మీడియాకు వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీలకు పాల్పడిన ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు, అభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపెట్టినట్లు చెప్పారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కడప జిల్లా అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన ప్రస్తుతం బద్వేల్ పట్టణంలోని గుంతపల్లిలో నివాసం ఉంటున్న గుమ్మాల వెంకటసుబ్బయ్య అతడి స్నేహితుడు రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన ప్రస్తుతం కడప నగరంలోని తిలక్‌నగర్‌లో నివాసం ఉంటున్న గొర్లకుమార్ అలియాస్ అమర్ రాజ్‌కుమార్‌లు ఇరువురు కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఆగస్టు 18వ తేదీ రాత్రి సుండుపల్లె మండల కేంద్రంలో కెనరా బ్యాంకు వెనుక వైపున సాయినగర్, పద్మరాజునగర్‌లో రెండు చోట్ల చోరీకి పాల్పడ్డారని, అలాగే అదే నెల 31వ తేదీ రాత్రి సుండుపల్లె బస్టాండు సమీపంలో గల ఆర్ ఎస్ జ్యువెలరీ షాప్‌లో చోరీ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు ఈ చోరీల ఘటనపై సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. నిందితులను ఇప్పటికే పలు చోరీల కేసుల్లో సిద్దవటం పోలీసులు అరెస్టు చేశారన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని విచారించగా సుండుపల్లె మండల కేంద్రంలో మూడు చోట్ల చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలను రాయచోటి-సుండుపల్లె మార్గంలోని రాచంవాండ్లపల్లెకు సమీపంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా అటవీ ప్రాంతంలో పాతిపెట్టినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలియజేశారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.24 లక్షల విలువ గల 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన వివరించారు. తక్కువ సమయంలో చోరీ కేసును ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సుండుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు, సీసీఎస్ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

మిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

కురబలకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గుత్తి నాగశ్వేత కర్ణాటక బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎలిప్టిక్ కర్వ్ క్రిప్టోగ్రఫీ యూసింగ్ ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అర్రే' అనే అంశంపైన చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని తెలిపారు. కాగా డాక్టరేట్ సాధించిన ఆమెను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి రాజశేఖరన్ అభినందించారు.



నాగశ్వేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

స్థల ఆక్రమణలపై జేసీకి ఫిర్యాదు

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇతరులు కబ్జా చేస్తున్నారని పీలేరులోని పంచాయతీ పారిశుధ్య కార్మికులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య ఫిర్యాదు చేశారు. సర్వే నెం.1/16లో 2013లో ప్రభుత్వం 83 మంది పారిశుధ్య కార్మికులకు ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల కొంతమంది ఆ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని తమపై దాడులు చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వరి పంట కోసే యంత్రం నడుపుతున్న డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కె.మారిముత్తు (21) తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా, వేపూరు తాలూకా, పెరయనేసలూరుగా తెలిసింది. గ్రామంలోని బి.రాధకు చెందిన వరి పొలంలో పంట కోసేందుకు హార్వెస్టర్ వాహనాన్ని అద్దెకు మాట్లాడుకున్నారు. వాహనం పైన అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను తప్పించడానికి ఉపయోగపడే ఇనుప పైపును ఉంచుకున్నారు. బుధవారం మారిముత్తు అదే పొలం మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లను గమనించకుండా వరి పంటను కోస్తుండగా పైనున్న ఇనుప పైపుకు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో పై నుంచి పడిపోయి మృతి చెందాడు. తమిళనాడు నుంచి మారిముత్తు తల్లిదండ్రులు గురువారం గ్రామానికి చేరుకుని అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఎం. మహమ్మద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అవివాహితుడైన మారిముత్తుకు వయసుడిగిన తల్లిదండ్రులు, దివ్యాంగుడైన తమ్ముడు ఉన్నారని పోలీసులు తెలిపారు. శవ పరీక్ష అనంతరం మారిముత్తు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.



మహామర్రి

కడప నగర శివారులోని వాటర్‌గండి వద్ద రామలింగేశ్వరాలయం చెంతన మహా మర్రివృక్షం ఉంది. ఇక్కడి పెన్నా నది సందర్శనకు వెళ్లే పర్యాటకులు ఈ చెట్టుకింద సేదతీరుతుంటారు. ఎంతటి మండే ఎండల్లో అయినా ఇక్కడ చల్లగా ఉంటుంది. పక్కనే శివాలయం ఉండటంతో కార్తీక మాసంలో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఈ చెట్టుకు సుమారు 400 సంవత్సరాల వయసు ఉంటుందని ఆలయ పూజారి రోశయ్య తెలిపారు. చెట్టు విస్తరించే వీలులేకుండా ఒకవైపు ఆలయం మరోవైపు కొన్ని నిర్మాణాలు, ఇతర చెట్లు ఉన్నాయి. అయినా ఈ చెట్టుకు వందల సంఖ్యలో ఊడలు ఉండటంతో విశేషంగా ఆకట్టుకుంటోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



పాఠశాలల టైమింగ్స్‌లో మార్పు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల టైమింగ్స్ మార్పు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో అమలు చేసేందుకు 36 పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ నెల 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు కానుంది.

రాష్ట్రంలో పాఠశాలల టైమింగ్స్ మారనున్నాయి. కొత్త టైమింగ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ముందు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలు చేయాలని ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల టైమింగ్స్ మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



పాత పనివేళలు వెయిటేజీతో పాటు ప్రతి పీరియడ్ సమయాన్ని మాత్రమే పెంచాలని స్పష్టం చేశారు. దీని ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు సిలబస్‌ను కవర్ చేయడానికి.. బోధన అభ్యసనా ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వనున్నారు. గతంలో ఉన్నత పాఠశాల పనివేళలు ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.40 వరకు కొనసాగుతుండేవి. వీటిపై ఉన్న ఇబ్బందులను గత పాలకులు పరిశీలించి పాఠశాల పనివేళలు ప్రాథమిక పాఠశాలలకనుగుణంగా మార్పు చేశారు. గత మూడేళ్లుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం పనివేళలు మార్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఇబ్బంది పడే అవకాశాలున్నాయని వాపోతున్నారు.

- పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక ఉన్నత పాఠశాల
- జిల్లాలో 36 పాఠశాలలను సిద్ధం చేసిన విద్యాశాఖ
- ఈ నెల 25 నుంచి 30 వరకు అమలు

ఇవే సమస్యలు

పాఠశాల పనివేళలు మార్పు చేయడం ద్వారా రవాణా సౌకర్యం అందుబాటులోకి లేని చోట ఐదు కి.మీ పరిధి నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. డ్రాపవుట్ల శాతం కూడా పెరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల అనుకోని దుర్ఘటనలు కూడా సంభవించవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. మానసిక శాస్త్రం ప్రకారం విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఏడు గంటల పాటు పాఠశాలల్లో విద్యార్థులు ఉండడం ద్వారా మానసిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం కూడా ఉందని పలువురు చెబుతున్నారు.

పాఠశాలల సమయం ఇలా....

రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో సమయాన్ని పెంచేందుకు అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. యధావిధిగా ఉదయం 9గంటలకు ఫస్ట్ బెల్, 9.05కు సెకండ్ బెల్ ఉంటుంది. 9.25 వరకు 20 నిమిషాల పాటు ప్రార్థన ఉంటుంది. ఫస్ట్ పీరియడ్ 9.25 నుంచి 10.15 వరకు సెకండ్ పీరియడ్ 10.15 నుంచి 11 వరకు, 11 నుంచి 11.15 వరకు షార్ట్‌బ్రేక్ , 11.15 నుంచి 12 వరకు థర్డ్ పీరియడ్, 12 నుంచి 12.45 వరకు 4వ పీరియడ్, 12.45 నుంచి 1.45 వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. అనంతరం 1.45 నుంచి 2.30 వరకు ఐదో పీరియడ్, 2.30 నుంచి 3.15 వరకు 6వ పీరియడ్, 3.15 నుంచి 3.30 వరకు బ్రేక్, 3.30 నుంచి సాయంత్రం 4.15 వరకు 7వ పీరియడ్, 4.15 నుంచి 5గంటల వరకు 8వ పీరియడ్ జరగనుంది.

నవంబరు 30 వరకు పైలెట్ ప్రాజెక్టు

జిల్లాలో ప్రతి మండలంలో ఒక ఉన్నత పాఠశాలలో నవంబరు 25 నుంచి 30 వరకు పైలెట్ ప్రాజెక్టు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు ప్రతి మండలం నుంచి ఒక హైస్కూలు ప్లస్‌ని గుర్తించి పాఠశాలల జాబితాను నవంబరు 20న పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ 36పాఠశాలలను గుర్తించి రాష్ట్రవిద్యాశాఖకు పంపించినట్లు సమాచారం.

ప్రారంభమైన పీజీ సెమిస్టరు పరీక్షలు



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ సెమిస్టరు పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. యూనివర్శిటీ ఆవరణలో ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో ప్రారంభమైన పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి క్రిష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసరు కాత్యాయని మాట్లాడుతూ పీజీ పరీక్షలకు తొలిరోజు 488 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు డిసెంబరు 4 వరకు కొనసాగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్‌లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇషా ఫౌండేషన్ సారథ్యంలో గ్రామోత్సవ వేడుకలలో భాగంగా ఈనెల 24వ తేదీ ఆదివారం కడప డీఎస్ఏ మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ (పురుషులు) క్రీడా పోటీలు జరుగనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ప్రధానంగా గ్రామస్థులలో ఐక్యత, సంస్కృతిని మరింత పెంపొందింప చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని 13 జిల్లాలలో 16వ గ్రామోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేస్తారన్నారు. జిల్లాలోని ఆసక్తిగల వాలీబాల్ క్రీడాకారులు తప్పక పోటీలలో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతిగా 9వేలు, ద్వితీయ విజేతకు 6వేలు, తృతీయ విజేతకు 2 వేలు అందజేస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులంతా ఒకే గ్రామం, లేదా ఒకే పట్టణ పంచాయతీకి చెంది వుండాలన్నారు. కాగా మునిసిపాలిటీ, కార్పొరేషన్ పరిధి జట్లు అనర్హులన్నారు. కనీస వయస్సు 14 నుంచి వుండవచ్చన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇవ్వాలి

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే విక్రయించాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన ధరలు తగ్గించి బెల్టుషాపులను నియంత్రించాలని కోరారు. గురువారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందుబాబులకు శుభవార్త. రేట్లు తగ్గించి నాణ్యమైన మందు ఇస్తామని ఎన్నికలముందు చంద్రబాబు చేసిన ప్రచార వీడియోను ప్రెస్‌మీట్‌లో రాచమల్లు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నెన్నో హామీలు గుప్పించిన చంద్రబాబు గెలిచిన తరువాత ఇతరులను మోసం చేసినట్లే మందుబాబులను కూడా వంచించాడన్నారు. ఆయన చెప్పినట్లు ధరలు తగ్గించలేదని... అప్పుడు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాయన్నారు. అప్పటి డిస్టలరీలే ఇప్పుడు కూడా ఉన్నాయని ఆరోపించారు. నాడు అదే మద్యం విషం అని ప్రచారం చేశారు. మరి ఇప్పుడు అదే మద్యం ఎలా విక్రయిస్తున్నారని ప్రశ్నించారు ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం నాణ్యమైన మద్యం ఇవ్వాలని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల విధి

ఒంటిమిట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల విధి అని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేపట్టారు. సర్కిల్ పరిధిలోని నేరాల తీవ్రతపై స్థానిక అధికారులను అడిగి వివరాలు సేకరించారు. మండలంలో ఎర్రచందనం, ఇసుక, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించి ఫిర్యాదులను స్వీకరించి సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. భార్యాభర్తలకు పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ చేపట్టాలని, ఇరువురికి సర్దిచెప్పి కౌన్సెలింగ్ చేపట్టడం ద్వారా ఫ్యామిలీ సమస్యలను పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి



సుమతి మృతదేహం

చాపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకానగరం గ్రామం వద్ద కడప కర్నూలు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మారిగాళ్ల సుమతి (17) అనే విద్యార్థిని మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. ద్వారకానగరం గ్రామానికి చెందిన సుమతి రోడ్డుకు అవతలివైపునకు వెళ్లి కొళాయి వద్ద బట్టలు ఉతుక్కుని తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుదాటుతుండగా.. మైదుకూరు నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమతి మైదుకూరులోని ప్రభుత్వ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందాగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప వన్‌టౌన్ సర్కిల్ వద్ద బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో మహమ్మద్‌రఫి (32) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన మహ్మద్‌రఫి కొన్నేళ్లక్రితం కడపకు వచ్చి వైవీ స్ట్రీట్‌లోని బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి... కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కడప ఎర్రముక్కపల్లెకు చెందిన డాక్టర్ రాహుల్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో బుధవారం రాత్రి వెళుతుండగా సీఎస్ఐ చర్చి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాదుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కువైత్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం కువైత్ వెళ్లిన మస్తాన్‌వల్లి (40) గుండెపోటు రావడంతో మూడు రోజుల కిందట మృతి చెందాడు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తెప్పించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పెనగలూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన మస్తాన్‌వల్లి యేడాది కిందట భార్యబిడ్డలను వదిలి కుటుం బ పోషణ కోసం కువైత్ వెళ్లాడు. అక్కడ షేక్ ఇంటిలో ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల కిందట చాతిలో తీవ్రంగా నొప్పి వస్తుందని కువైత్‌లో ఉన్న బంధువులకు తెలపడంతో వారు షేక్ ఇంటివద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే అతని యజమానులు ఆసుపత్రికి తరలిస్తుండగా మస్తాన్‌వలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మస్తాన్‌వల్లి మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సమీపంలోని ఎస్ఆర్ పాలెం అటవీ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలు పట్టుకుని ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చిరంజీవులు, నరేష్, కిరణ్‌కుమార్‌లు కలిసి ఎస్ఆర్ పాలెంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎర్రచందనం దుంగలు మోసుకువస్తున్న ఇరువురు నిందితులను పట్టుకుని దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

5 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



వల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెరువుకిందపల్లె పాపాఘ్ని నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకుని.. జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఇసుకను తమ కార్యాలయ అవరణలో డంప్ చేశామని.. ఎవరైనా ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు : ఎస్టీఎఫ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనివేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి మనోవిశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. గురువారం ఎస్టీఎఫ్ జిల్లాకార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో అగ్రస్థానంలో ఉన్న కేరళతో పాటు మరికొన్ని పాఠశాలలు ఉదయం 10 గంటల నుంచి 4గంటల వరకు కొనసాగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో పనివేళలు పెంచడానికి గల కార ణం ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పనివేళలు విద్యార్థుల్లో అభ్యసనా సంసిద్ధత మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు వంటి అనేక అంశాలకు ముడిపడి ఉంటాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతం నుంచి వస్తుంటారు కాబట్టి రవాణా సౌకర్యంలో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల పనివేళలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రసాద్, ఎల్‌వీ శంకర్ పాల్గొన్నారు

పోక్సో కేసు నమోదు

సీకేదిన్నె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యా చారానికి పాల్పడిన ముగ్గురిపై పోక్సో కేసు నమోదైనట్లు సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామం లో నెల రోజుల క్రితం ఓ బాలికపై ఇద్దరు అత్యాచారం చేశా రు. వారిద్దరితో పాటు మరో మైనర్ బాలుడు ఉన్నాడు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేటకు చెందిన బోనాల బ్రహ్మయ్య (46) అదృశ్యమయ్యాడు. ఈనెల 1వ తేదీ సాయంత్రం మద్యం తాగి భార్య గోవిందమ్మతో గొడవపడి ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆ రోజు నుండి ఇప్పటి వరకు ఇంటికితిరిగి రాలేదని.. సెల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు అతని తండ్రి ఈశ్వరయ్య అర్బన్ పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

24 నుంచి అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. కడపలో గల ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కోటఆర్ఎం మైదానాలలో మ్యాచ్‌లు జరుగనున్నాయన్నారు.

భూమి విలువ పెంచుతాం: ఆర్డీఓ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ భానుశ్రీ

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కోసం తీసుకున్న భూమి విలువ 1.25 శాతం పెంచుతామని ఆర్డీఓ భానుశ్రీ అన్నారు. గురువారం వీరపునాయునిపల్లె, ఎస్.పాలగిరి, తంగేడుపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులకు నేలతిమ్మాయపల్లెలో నిర్వహించిన గ్రామసభకు ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ రహదారికి సైడ్ భూమి విలువ రూ.11.90లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈవిషయమై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడమే గ్రామసభ ఉద్దేశ్యమన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం వీరపునాయునిపల్లె జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు గవేశ్వరయాదవ్ అధ్యక్షతన బీజేపీ క్రియాశీలక సభ్యుల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సత్తా నిరూపించాలంటే సంస్థాగతంగా బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి ప్రజలకు చేరువకావాలన్నారు. జిల్లా క్రియాశీలక ఇన్‌చార్జి శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి, గండిగంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో
నకిలీ చలానాలు

- సృష్టించిన మున్సిపల్ సర్వేయర్
- కమిషనర్ సంతకం సైతం ఫోర్జరీ
- మున్సిపల్ ఆదాయానికి గండికొట్టిన వైనం
- మెమో జారీ చేసిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీని అవినీతి చీడ ఎంతకూ వదలనంటోంది. ఇంతవరకు మున్సిపాలిటీలో ఏదైనా పనిచేయడానికి పర్సెంటేజీల వంతున మామూళ్లు తీసుకునేవారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్‌లో ఉన్న సర్వేయర్ ఏకంగా మున్సిపాలిటీకి కట్టవలసిన చలానాలనే నకిలీవి సృష్టించి మరీ మున్సిపాలిటీ సొమ్ము స్వాహా చేశాడు. వివరాలిలా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఏడాది క్రితం మున్సిపల్ సర్వేయర్‌గా కృష్ణకిశోర్ వచ్చినప్పటి నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి సర్వే నెంబరు కోసం వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇచ్చే ధ్రువీకరణ పత్రంకోసం ఆ స్థలం విలువను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే నిర్దిష్టంగా అతనిపై ఇంతకాలం ఫిర్యాదులు రాలేదు. ఇటీవల ఒక సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం కొందరు దరఖాస్తు చేసి మున్సిపాలిటీకి చెల్లించవలసిన చలానా రూ.1000తో పాటు సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మరో రూ.5వేలు లంచంగా ఇచ్చారు. కానీ పనిచేయడంలో ఆలస్యం కావడంతో ఆ విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మున్సిపల్ సర్వేయర్ సర్వేనెంబరు కోసం పెట్టిన ఫైల్స్‌ను తెప్పించి పరిశీలించారు. ఈ దరఖాస్తుకు చలానాలు కట్టారా లేదా అని పౌరసేవా కేంద్రంలోని క్యాష్ కౌంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అక్కడ సర్వే నెంబరు ధ్రువీకరణ కోసం చలానాలు కట్టినట్లు రికార్డులో లేదు. కానీ ఈ చలానాలు ఎలా వచ్చాయి.. అని వాటిని నిశితంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలిపోయింది. చలానాల్లో క్యాషియర్ సంతకాలు సైతం లేకపోవడం కమిషనర్ సంతకం కూడా ఫోర్జరీ ఉండటం గుర్తించారు. కొద్దిరోజుల రికార్డు చెక్ చేస్తేనే 20 నకిలీ చలానాలు బహిర్గతమయ్యాయి. ఇంకా అతను పనిచేసిన దినాల్లో జారీ చేసిన సర్వే నెంబర్ల ధ్రువీకరణ పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే పూర్తి స్థాయిలో ఎన్ని నకిలీ చలానాలు సృష్టించాడో వెల్లడవుతుంది. ఈ నకిలీ చలానాలపై సంజాయిషీ కోరుతూ గురువారం మున్సిపల్ సర్వేయర్ కృష్ణకిశోర్‌కు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మెమో ఇచ్చారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మున్సిపల్ సర్వేయర్ నకిలీ చలానాలు సృష్టించినట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవమని అన్నారు. వాటిని రికార్డు పరంగా పరిశీలించి గుర్తించామన్నారు.. నకిలీ చలానాలతో పాటు కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయడంతో అతనిపై ఎందుకు చర్య తీసుకోకూడదో ఒక్కరోజులో వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నట్టు తెలిపారు. ఆయన ఇచ్చిన వివరణ ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెత్త నుంచి సంపద ఏదీ..?

●నిరుపయోగంగా డంపింగ్‌యార్డులు ●ఆరుబయటే చెత్తదిబ్బలు ●దుర్గంధంతో గ్రామీణుల పాట్లు



మద్దయ్యగారిపల్లెలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు



మద్దయ్యగారిపల్లెలో చెత్తదిబ్బలు



మండల కేంద్రమైన పీటీఎంలో ఆరుబయటే పడవేసిన చెత్త

పెద్దతిప్పసముద్రం, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టి ఏమో గాని లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్‌యార్డులను నిరుపయోగంగా మూలనపడివేసిన వైనం పీటీఎంలో దర్శనమిస్తోంది. ఇక్కడే కాదు అనేక పంచా యతీలలో చెత్తనుంచి సంపద సృష్టి కాగితాలకే పరిమితమవుతోందని పలువురు వాపోతున్నారు. పీటీఎం మండలంలోని మద్దయ్యగారిపల్లెలో డంపింగ్ యార్డును వాడుకోకుండా నిరపయోగంగా పక్కన పడేశారు. అంతేకాకుండా గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పడవేసి దిబ్బలుగా మార్చడంతో వాటి నుంచి వస్తున్న దుర్గంధంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యమెందుకో..?

గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆయా పంచాయతీల్లో పంచాయతీ కార్మికులు,గ్రీన్ అంబాసిడర్లు అనుకున్న స్థాయిలో లేకపోవడం, పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. అంతేకాకుండా గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్లక్ష్యం చేయడంతో పరిస్థితి ఇలా తయారైందని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించక చెత్తదిబ్బలు పెరిగిపోతున్నాయని విమర్శిస్తున్నారు. మండలంలోని మద్దయ్యగారిపల్లెలో డంపింగ్ యార్డు ఉన్నా పంచాయతీ కార్మికులు గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డు పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో పారబోస్తుండడంతో చెత్త దిబ్బలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లు నిరుపయోగం

మండలంలోని మేజర్ పంచాయతీలుగా ఉన్న తుమ్మరకుంట, పట్టెంవాండ్లపల్లె పీటీఎం గ్రామాలకు గత ప్రభుత్వం చెత్త సేకరణ నిమిత్తం ట్రాక్టర్లను మంజూరు చేసింది అయితే ట్రాక్టర్లను చెత్త కోసం ఉపయోగించకుండా ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు తమ స్వంత అవసరాలకు వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లివెత్తుతున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకుని ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ ట్రాక్టర్లను వినియోగించుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మండల కేంద్రాల్లో సైతం సిబ్బంది కొరత

మండల కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం పారిశుధ్య కార్మికులు అరకొరగా ఉండడంతో మండల కేంద్రాల్లో సైతం పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో చేపట్టలేక పోతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. కనీసం గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం కోసమైన నిధులు వెచ్చించ కుండా కాలయాపన చేయడంతో వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. కనీసం ఈ కూటమి ప్రభుత్వంలోనైనా సరైన రీతిలో సిబ్బందిని నియమించి ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రవాణా శాఖా పనులపై మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

మదనపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ రవాణా కార్యాలయంలో వివిధ పనుల మీద వచ్చే కస్టమర్లు మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా వచ్చి పనులు చేసుకోవాలని స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ అధికారి డీఏ ప్రతాప్‌రావు, ఎంవీఐ దినేష్ చంద్రలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రక టన విడుదల చేశారు. అనవసరంగా మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోద్దని వారు సూచించారు. మదన పల్లె యూనిట్ ఆఫీస్ నుంచి ప్రాంతీయ కార్యాల యంగా ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేసినట్లు వారు పేర్కొన్నారు.

పంట బీమా పథకాన్ని వినియోగించుకోండి

కలకడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ఈ రబీ సీజన్‌లో టమోటా పంట సాగు చేసిన రైతులు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవా లని ఉద్యానవనశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన బాలయ్యగారిపల్లె, పోతువారిప ల్లెలో పొలాల క్షేత్ర సందర్శనకు వెళ్లి పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు డిసెంబ రు 15 లోగా వన్‌బీ, ఆధార్, బ్యాంక్‌ఖాతా వివరాలు, పంట ధృవీకరణ పత్రాలతోపాటు ఎకరానికి రూ.1600 ప్రిమియంను చెల్లించి కామన్ సర్వీస్ సెం టర్ లేదా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అమృత్‌కుమార్‌రెడ్డి, రమణమ్మ, చందన పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో తాగు నీటి సరఫరా వీధి లైట్ల మరమ్మతులతో పా టు పారిశుధ్యం నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి స్పష్టం చేశా రు. గతంలో వలే కాకుండా ఇప్పుడు పంచాయతీల నిర్వహణకు సరిపడా నిధులున్నాయని ప్రాధాన్యతల మేరకు నిదులు ఖర్చు చేయాలని సూచించారు. గురువారం డీపీవో మండలంలోని కలికిరి, పత్తేగడ పంచాతీలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, పత్తేగడ కార్యదర్శి గిరి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో కొనసాగిన ఆక్రమణల తొలగింపు

బి.కొత్తకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో కమిషనర్ పల్లవి తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో గురువారం వరుసగా రెండవ రోజుసైతం ఆక్రమణల తొలగింపు కొనసాగింది. మదనపల్లె రోడ్డులో ఆక్రమించిన వారందరూ సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ ఏమాత్రం రాజీ పడకుండా ఆక్రమణలు తొలగించారు. రెండు రోజు లుగా ఆక్రమణల తొలగింపుతో నిల్వ వుండిపోయిన వ్యర్థాలను ట్రాక్టర్లతో బయటికి తరలించారు. పట్టణంలోని ప్రధానరోడ్లలో ఆక్రమణల తొలగింపుతో బస్సులు ఇతర వాహనాల రాకపోకలు పట్టణంలోనుంచి కాకుండా బైపాస్ రోడ్డు మీదుగా నడిచాయి.

90శాతం సబ్సిడీతో గోకులం షెడ్ల నిర్మాణాలు

నిమ్మనపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి రైతును దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో నిర్మాణాలు చేపట్టడంతో పాడి రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉపాధి ఏపీవో రమేష్ మాట్లాడుతూ పది పంచాయతిలకు గానూ మొదటి విడతగా 25యూనిట్లు మంజూరయ్యాయని వాటిపై ఇప్పటికే 234 దరఖాస్తులు రాగా వాటిలో ప్రతి పంచాయతికి రెండు లెక్కన కేటాయించాయని తెలిపారు. ఎంపికైన పాడి రైతులకు నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని అనుమతులు ఇచ్చామని ఇప్పటికే పలు చోట్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తంబళ్లపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రబీ సీజన్‌కు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, కూటమి నాయకులు స్వామి రెడ్డి, సురేంద్ర, జగదీష్, భాస్కర్, వీఏఏలు మల్లీశ్వరీ, సురేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ జాఫర్ మృతి

పెద్దతిప్పసముద్రం నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పీటీఎంకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ జాఫర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం నేత జయచం ద్రారెడ్డి టీడీపీ నాయకులతో కలిసి జాఫర్ మృతదేహానికి నివాళులర్పించారు.

మహిళ ఆత్మహత్య

మద నపల్లె అర్బన్, నవ ంబరు21(ఆంధ్రజ్యోతి): కోమ టివానిచెరువులో లక్ష్మీబాయ్(45)అనే మహిళ ఆత్మ హత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు మదనపల్లె పట్టణం కోటగడ్డవీధికి చెందిన కోదండరావు భార్య వైఖరీ లక్ష్మీబాయ్ ఆర్థిక పరిస్థితి భాగాలేక, మతిస్థిమి తం లేక కోమటివాని చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. భర్త అబ్‌జైవర్ పని చేస్తూ 15 ఏళ్లక్రి తం మృతి చెందాడు. కుమార్తెకు పెళ్లిచేయగా, ఒక కుమారుడు ఉన్నా ఇంటిని పట్టించుకోక పోవడంతో మానసికంగా కోల్పోయి లక్ష్మీబాయ్ ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారుజ

పాఠశాల పనివేళల పెంపు ఉపసంహరించాలి



పెద్దమండ్యం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

పెద్దమండ్యం/రామసముద్రం. నవంబరు 21(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని వేళల పెంపు నిర్ణయం ప్రభుత్వం ఉపసంహరిం చుకోవాలని జిల్లా ఎస్టీ యూ అధ్యక్షుడు అంకం శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి పేర్కొన్నారు. మం డలంలో పెద్దమండ్యం, కలిచెర్ల ఉన్నత పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పనివేళల్లో మార్పు చేస్తూ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలన్న నిర్ణయాన్ని సంఘ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, నరసింహులు, సీవీరమణ, మధుకరరెడ్డి, హరీష్, వెంటేశ్వర్లు, ఖాదర్‌వలి, శ్రీనివాసులురెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఉన్నత పాఠశాలల్లో పనివేళలు పెంపు నిర్ణయం ఉత్తర్వులను ఉపసంహరించాలని రామసముద్రం మండలం చెంబకూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురు వారం నిరసన తెలిపారు. చెంబకూరు ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పాఠశాలను కొనసాగించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు రూ.2.10 లక్షలతో హెరిటేజ్ ఆసరా



మృతుడి కుటంబానికి చెక్కును అందజేస్తున్న హెరిటేజ్ సిబ్బంది

బి.కొత్తకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ డైరీకి పాలను ఉత్పత్తి చేస్తున్న ఓ పాడిరైతు మృతితో అతని కుటుంబానికి హెరిటేజ్ డెయిరీ రూ.2.10లక్షల ఆర్థిక సాయంతో ఆసరాగా నిలిచింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ పరిధిలోని చంద్రరాజులపల్లెకు చెందిన పాడిరైతు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెలరోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మృతిచెందాడు. ఇతనికి భార్య నీలావతితో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రతి పాడిరైతుకు హెరిటేజ్ సంస్థ ప్రీమియం చెల్లించి చేయించే బీమాలో భాగంగా ఈ రైతుకు రూ.2.10 లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుడి స్వగ్రామమైన చంద్రరాజులపల్లెకు వెళ్లి హెరిటేజ్ సిబ్బంది కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో హెరిటేజ్ జోనల్ ఇన్‌చార్జి గోపాలక్రిష్ణ, రీజనల్‌హెడ్ సర్వోత్తంరెడ్డి, ఏరియా మేనేజర్ ఆదినారాయణ, బ్రాంచి మేనేజర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థులు

తంబళ్లపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు వాలీబాల్, జావలిన్ త్రో విభాగాలలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ నిజాముద్దీన్ దేశ్‌ముఖ్ తెలిపారు. సుండుపల్లిలో జరిగిన పోటీలలో 8 మంది బాలికలు, 12 మంది బాలురు రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వగా తంబళ్లపల్లె నుంచి 6 మంది బాలురు ఎంపికయ్యారన్నారు. వారికి ఈ నెల 20, 21 తేదీలలో నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించగా వాలీబాల్ విభాగంలో బి.నిరంజన్‌నాయక్, సాయి నాయక్, ఈశ్వర్‌కుమార్‌నాయక్‌లు సత్తా చాటి ఈ నెల 24,25 తేదీలలో విశాఖపట్టణంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని పీఈటి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్ని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ షబానా అభినందించారు.

తొలగని 'అపార్' కష్టాలు!

పీలేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీలో గురువారం కూడా ప్రజలకు 'అపార్' కష్టాలు తొలగలేదు. తాము ఇచ్చిన దరఖాస్తుల ఏమయ్యాయో తెలియజేయాలంటూ పలువురు గురువారం పంచాయతీ కార్యాలయానికి పోటెత్తారు. అయితే వారికి సరైన సమాధానం లభించకపోవడంతో పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో పడి ఉన్న తమ దరఖాస్తులను వారే వెతుక్కుని మళ్లీ అక్కడి సిబ్బందికి అందజేశారు. 'అపార్'ను వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలని విద్యాసంస్థలు తమపై ఒత్తిడి చేస్తుంటే పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజలు పంచాయతీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

రోడ్డుప్రమాదంలో దంపతులకు గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో దంపతులు సంతోష్(40), సయ్యద్‌మా(38) గాయపడ్డారని మదనపల్లె తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. అంకిశెట్టిపల్లెకు చెందిన వారు ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో మరో బైకు ఎదురుగా వచ్చి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

మహిళపై మూకుమ్మడి దాడి

మదనపల్లె అర్బన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి) :దారి విషయంగా గొడవలో గంగులమ్మ(60) అనే మహిళపై ప్రత్యర్థులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, అవకిశెట్టిపల్లె చెందిన గంగులమ్మ ఇంటికి వెళ్లేదారిలో వెంకటేశ్వర, శివరాం, రత్నమ్మ, రాళ్లను అడ్డుగా వేశారు. ఇలా ఎందుకు చేశారని నిలదీయగా వెంకటేశ్వర వర్గీయులు ఆమెపై దాడిచేసి గాయపర్చారని సీఐ చెప్పారు.

విత్తన శుద్ధితోనే అధిక దిగుబడులు

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాన్ని శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం రాయచోటి ఏడీఏ ఎస్. అశోక్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి మండలంలోని మేడికుర్తి, చీకటిపల్లె, రాజవారిపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి విత్తన శుద్ధి చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మిస్తున్న మరు గుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్‌ఖాన్ సూచించారు. మండలంలోని బూర్లపల్లె, పోతుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలను జేఈ బాలచంద్రాచారితో కలిసి పరిశీలించారు. మండలంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయండి

●సీఎం చంద్రబాబును కోరిన టీడీపీ నేత బాబురెడ్డి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గంగారపు బాబురెడ్డి

మదనపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి, సీఎం నారా చంద్రబాబునాయుడు కోరారు. రాష్ట్ర సచివాలయంలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంను కలసిన బాబురెడ్డి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. 2000లో బసినికొండకు మా తండ్రి గంగారపు సుదర్శన్‌చౌదరి పేరున రూ.50వేలు చెల్లించగా, ఉన్నత పాఠ శాల మంజూరు చేశారని ఈ సందర్భంగా బాబురెడ్డి వివరించారు. ఇదే తరహాలో ప్రస్తుతం అక్కడి అవసరాన్ని జూనియర్ కళాశాల మంజూరు చేయాలన్న ఆయన విన్నపంపై సీఎం సానుకూలంగా స్పందించారు. అలాగే గంగన్నగారిపల్లె హరిజనవాడలో రామాలయం పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని, బసినికొండ, గంగన్నగారిపల్లె, మొరవపల్లె, కురవపల్లెకు చెందిన కొందరు బాధితులకు సంబంధించిన వినతులు అందజేస్తూ వారిని ఆదుకోవాలని సీఎంను అభ్యర్థించారు. అలాగే బసినికొండ శివాలయం, గంగమ్మగుడి ఏరియా, మొలక లదిన్నెక్రాస్, హిజ్రాకాలనీలలో సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించాని కోరుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వినతి పత్రం అందజేశారు. వాటిపై చర్యలు తీసుకు నేలా అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ఇందులో మీడి యా రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ బొమ్మనచెరువు శ్రీరాములు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు ఉన్నారు.

సొంత నిధులతో తాగునీటి బోరు..తీరిన సమస్య

● టీడీపీ నేత జయచంద్రారెడ్డికి దారంవాండ్లపల్లె వాసుల కృతజ్ఞతలు



బోరును ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యో తి): తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి తన దాతృత్వాన్ని చాటారు. నెలల తరబడిగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తన సొంత నిధులతో తాగు నీటి బోరు వేయించి పరిష్కరించారు. నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్థులు ఇక నీటి సమస్య తీరిందంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ దారంవాండ్లపల్లెలో గత ఆరు నెలలుగా తాగునీటి సమస్య నెల కొంది. బోరులో నీరు రావడం నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు నాయ కులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. విషయాన్ని ఇటీవల గ్రామస్థులు టీడీపీ నేత జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో గ్రామంలో తాగు నీటి బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడడంతో జయచంద్రారెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. తమ గ్రామంలో నెలకొన్న తీగునీటి సమస్యను పరిష్కరించిన జయచంద్రారెడ్డిని స్థానికులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, నాయకులు రమణారెడ్డి, శివరాంరెడ్డి, రవికుమార్, బాలకృష్ణ, శ్రీనివాసు లు, నరసింహులు, పెద్దరెడ్డెప్ప, భాస్కర, దయ్యాల శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



సీఐని సన్మానిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు

ములకలచెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రల పరిరక్షణకు సహకరించాలని సీఐ లక్ష్మన్న సూచించారు. ములకలచెరువు సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లక్ష్మన్నను టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నేతలు తోట గిరిధర్, చెన్నకిష్టా, ముత్తుకూరు మౌళా, చింతకుంట్ల కేశవులు, విజయ్‌కుమార్, నాయకులు నాగరాజుయాదవ్, కక్కల సుదర్శన్, కాలా మహేష్, శంకర్‌నారాయణ, ఆదినారాయణ, శివన్న, సుధాకర్‌నాయుడు, బసివి చంద్ర, నారాయణస్వామినాయుడు, రామకృష్ణమరాజు, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలే లక్ష్యంగా పనిచేస్తాం



రామారావువీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న జాన్‌బాబు

మదనపల్లె టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో లక్ష టీడీపీ సభ్యత్వాలే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్ఏ మస్తాన్, జాన్‌బాబు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బెంగళూరు బస్టాండు, రామారావు కాలని వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభించిన తక్కువ రోజుల్లోనే నేటి వరకు 24వేలకు పైగా టీడీపీ సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే మదనపల్లెకు చేరుకోగానే సభ్యత్వ నమోదు కార్యక్రమం మరింత వేగంగా చేస్తామన్నారు. రామారావు కాలనిలో ఒక్క రోజే 214 మంది సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, నాగమణి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అవెన్యూరోడ్డులో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి



సబ్‌కలెక్టరేట్ డీఏవో పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం జేఏసీ నాయకులు

మదనపల్లె టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు సబ్ కలెక్టరేట్ డీఏవో పద్మావతికి గురువారం వారు వినతిపత్రం అందజేవారు. పట్టణంలో సీటీఎం రోడ్డు విస్తరణ చేశాక, ట్రాఫిక్ సమస్య తగ్గిందని అదే విధంగా అవెన్యూరోడ్డు, బెంగళూరు బస్టాండులో రోడ్డు పక్కన ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. బెంగళూరు బస్టాండు బాహుదా కాలువ పక్కన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆనుకుని వున్న పెట్రోల్ బంకు నాలుగేళ్ల క్రితం మూతపడిందన్నారు. ఇప్పుడు కొందరు ఈ పెట్రోల్‌బంకును తిరిగి ప్రారంభించేందుకు చూస్తున్నారని, ప్రభుత్వ నిబంధనపై పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయ కు లు ఉత్తన్న, సురేష్, మహేష్‌నాయుడు, నాగేంద్ర, వరప్రసాద్, హేమంత్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 115 మందికి ఉద్యోగాలు



మదనపల్లె టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 115 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ఆల్సెక్ టెక్నాలజి సంస్థ, డీఎన్‌బీ టెక్నాలజి సంస్థలు వేర్వేరుగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వారిలో ప్రతిభ చూపిన 30 మంది ఆల్సెక్ సంస్థలో బిజినెస్ ప్రాసెస్ ఉద్యోగాలకు ఎంపిక కాగా వారికి వార్షిక వేతనంగా రూ.2.16లక్షలు, మిగిలిన 85 మంది డీఎన్‌బీ సంస్థలకు ఎంపిక కాగా వారికి వార్షిక వేతనంగా రూ.2.04లక్షలు అందిస్తారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.